# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 210 | హైదరాబాద్ | బుధవారం 11-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

వరల్డ్ బ్యాంక్ ర్యాంకింగ్స్ లో భారత్ పైపైకి!

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు..
# బయటకు పరుగుతీసిన ప్రజలు

- తెలుదయం 10:10 గంటలకు కంపించిన భూమి
- భూప్రకంపనలా లేక పేలుడు జరిగి కంపించిందా అనేదానిపై అస్పష్టత
- సంఘటన స్థలానికి చేరుకున్న సంబంధిత అధికారులు

11లో





11లో

## ఏపీకి మరో వందేభారత్...
# కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు

- ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీ రైల్వే ప్రాజెక్టులపై సమగ్ర వినతిపత్రం అందజేత
- బెంగళూరుచెన్నై హైస్పీడ్ రైలును తిరుపతితో కలపాలని విజ్ఞప్తి
- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించాలని కోరిక
- విజయవాడబెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ ఏర్పాటుకు వినతి

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఫోన్ ట్యాపింగ్..
# బాంబు పేల్చిన మంత్రి పొంగులేటి

- బాధ్యులపై ఉక్కుపాదం తప్పదన్న మంత్రి

11లో





## వాయుసేనకు 114 కొత్త రఫేల్స్..
### రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

- భారత వాయుసేన కోసం 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు రంగం సిద్ధం
- రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందానికి త్వరలో రక్షణ శాఖ ఆమోదం
- ఒప్పందంలో భాగంగా సుమారు 100 యుద్ధ విమానాల దేశీయ తయారీ

11లో

# సీఎం సొంత జిల్లాలోనే నీటి కష్టాలు..
## గుంటనక్కకు, రేవంత్‌కి మధ్య ఉన్న సంబంధం ఏంటి?



11లో

- మహబూబ్‌నగర్‌లో రెండు మూడు రోజులకోసారి నీళ్లు
- మున్సిపాలిటీల్లో గుట్టలుగా చెత్త
- సిద్ధిపేటకే నిధులు ఎందుకు?
- మిగితా మున్సిపాలిటీల మాటేంటి?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను..
## స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!



11లో

## రూ. 1,511 కోట్ల విలువైన భూములను
# రక్షించిన హైడ్రా..

- నగరం నలువైపులా హైడ్రా మెరుపు దాడులు
- చెరువులు, పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- జంగం కుంట, అల్వాల్ కొత్త చెరువుల్లో 12 ఎకరాల స్వాధీనం
- ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి పొందిన పార్కులు




12లో




'ఏఐ' కంటెంట్ దుర్వినియోగంపై
## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు

చట్టవిరుద్ధమైన అంశాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలు ఉండాలన్న కేంద్రం

11లో

భారతశక్తి

# అందరి చూపు సుప్రీం వైపు

సర్ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం కలిగించేందుకు అనుమతించబోమని, అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ అధికారుల పేర్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాన్ని ఎప్పుడూ కోరలేదన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ ప్రస్తుతం 8,500 మంది అధికారుల జాబితాను సమర్పించామని, దాన్ని కోర్టు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ ఆ జాబితాలో అధికారుల పేర్లు, హోదాలు, పనిచేసే ప్రాంతాల వివరాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారిని ఎలా సంప్రదిస్తారు? మరుసటి రోజే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్వో) వద్ద రిపోర్ట్ చేయగలరా? అంటూ ప్రశ్నించగా.. దానికి న్యాయవాది దివాన్ అవునని సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్షలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని ఓటర్ల జాబితాల్లోంచి వేలాది మంది ఓటర్లను అనర్హులుగా తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ విధంగా తొలగించడం అన్యాయమని ధ్వజమెత్తుతూ దీనిపై తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావడం సంచలనం కలిగించింది. నిజాయితీగా అర్హులైన ఓటర్లకు జాబితాలో చోటు లభించాలి. ఈమేరకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టక ముందు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలో 7.66 కోట్ల వరకు ఎంట్రీలు ఉండేవి. అందులోంచి 58 లక్షల పేర్లను తొలగించిన తరువాత ఎన్నికల కమిషన్ నమూనా జాబితాను ప్రకటించి 1.16 కోట్ల ఎంట్రీల్లో తార్కిక వైరుధ్యాలు ఉన్నాయని వెల్లడించింది. ఇది క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి చేసిన ఒక ప్రయత్నం లేదా నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి ఉపయోగించే తప్పుడు సాకును తెలియజేస్తుందని చెప్పవచ్చు. ఈ పొంతనలేని అసంబద్ధమైన పదజాలాన్ని ఉపయోగించి ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్ ప్రజలను తమ పాలకులను ఎన్నుకునే హక్కు నుంచి దూరం చేయడమే అవుతుంది. ఓటు వేసే హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభంలా ఆచరణలో ఉంటోంది. భారత దేశం వివిధ భాషలు, మాండలికాలు కలిగిన బహుళ భాషా సమాజం ప్రపంచం లోనే అత్యధికంగా భాషా వైవిధ్యం కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ పరిగణించబడుతోంది. రాజ్యాంగం లోని 8వ షెడ్యూల్‌లో 22 భాషలకు గుర్తింపు కలిగినప్పటికీ దేశవ్యాప్తంగా వందలాది భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ భాషల్లో సరైన నామవాచకాలు రాసేటప్పుడు తేడాలు, అనివార్యమైన తప్పులు చోటు చేసుకోవచ్చు. దీదీ వాదనలను న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. సీఎం ఆవేదనలో నిజం ఉందని, ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అనంతరం మమతా బెనర్జీ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది. విచారణ సందర్భంగా.. ఈసీఐపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియలో ఆధార్‌ను అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. సర్ ఒత్తిడి కారణంగా 100 మందికిపైగా ప్రజలు మరణించారని దీదీ ఆరోపించారు. అనేక మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ప్రజల హక్కులను కాపాడండి అంటూ దీదీ తన వాదనలను ముగించారు. పురుషులు, మహిళలు వయసులో తేడాలు, 15 ఏళ్ల కన్నా తక్కువ లేదా 50 ఏళ్ల వరకు తమ తల్లిదండ్రులకు తమకు తేడా ఉండవచ్చు. కొన్నిసార్లు దంపతులకు ఆరు లేదా అంతకన్నా ఎక్కువ సంతానం ఉండవచ్చు. చాలా మంది మహిళలు తమ పేరు చివరన తమ భర్త పేరు చేర్చుకుంటుంటారు. ఇవన్నీ భారత దేశ ప్రజాజీవనంలో వాస్తవాలే తప్ప ఓటర్ల జాబితాలో పేర్లను కొట్టేసినంత శక్తివంతమైన తార్కిక వ్యత్యాసాలు కావు. ఈ సమస్యలను సుప్రీం కోర్టే స్వయంగా ప్రస్తావించిందని గుర్తు చేసుకోవాలి. ఓటర్ల జాబితాల్లోంచి పేర్లను తొలగించడానికి వాటిని సాకుగా ఉపయోగించడంపై తన అసమ్మతిని వ్యక్తం చేసింది కూడా. ఈ అసంబద్ధ కారణాలను ఎన్నికల కమిషన్‌కు ఎత్తిచూపడానికి తన వాదనలు వినిపించగా వాటిని ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఇక చేసేది లేక ఆమె నేరుగా సుప్రీం కోర్టు ముందు హాజరై తన వాదనలను వినిపించారు. దీనికి సుప్రీం కోర్టు స్వాగతించింది. ఈ గజిబిజి వ్యవహారంలో మరింత సున్నితంగా వ్యవహరించాలని ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు సూచించింది. మమతా బెనర్జీ వాదించిన అంశాలు ఒక సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలని మనల్ని అడుగుతున్నాయి. వి మనదేశం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి కీలకమైన అంశాలు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు. చట్టం ద్వారా నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తప్ప మరెప్పుడూ అలా జరగకూడదు. ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుంది. అదే విధంగా సర్వసత్తాక గణతంత్ర దేశంలో ప్రతి పౌరునికీ ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉంటుంది. కాబట్టి దానిని జీవించే హక్కుతో సమానంగా పరిగణించాలి. ఓటరు జాబితా నుంచి ఎవరిని తొలగించినా చట్ట నిబంధనల ప్రకారం మొదట సరైన విధానాన్ని అవలంబించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు ఎవరినైనా అనర్హులని ప్రకటిచడం వెనుక పోల్ ప్యానెల్‌లో పనిచేసే అధికారుల ఇష్టాయిష్టాలు, అభిరుచులు మాత్రమే బలీయమైన కారణం కాకూడదు.

## రాజ్యసభ రేసు...

# మా కో సీటు కావాలంటూ వినతులు

విజయవాడ, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు 'రాజ్యసభ సీట్ల' చుట్టూ తిరుగుతున్నాయి. వచ్చే జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కోసం అధికార కూటమిలో ఇప్పటి నుంచే సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయమని తేలిపోవడంతో, ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, మొత్తం 4 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ రెండు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం కనిపిస్తోంది. తమకు ఖచ్చితంగా ఒక స్థానం కేటాయించాలని పవన్ కల్యాణ్ పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందున, తమ పార్టీకి పెద్దల సభలో ప్రాతినిధ్యం ఉండాలని జనసేన గట్టిగా కోరుతోంది. జనసేన కోటాలో సీటు దక్కితే, ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీకి ఆయన అందిస్తున్న సహకారం, పవన్ కల్యాణ్‌తో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు ప్లస్ కానున్నాయి. టీడీపీతో సత్సంబంధాలు రమేశ్ కు కలిసొచ్చే అంశంఇక టీడీపీకి దక్కే రెండు స్థానాల కోసం పార్టీ సీనియర్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా మహేశ్వర రావు, పార్టీ విధేయుడు కంభంపాటి రామ్మోహన్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత సభ్యుడు సానా సతీశ్ తన పదవిని రెన్యూవల్ చేసుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీ అవసరాల దృష్ట్యా చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. బీజేపీకి దక్కే ఒక స్థానం విషయంలో అత్యంత ఆశ్చర్యకరమైన చర్చ జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండి ఆ పార్టీ నుంచి బయటికొచ్చిన విజయసాయి రెడ్డి, అనూహ్యంగా బీజేపీ తరపున రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు రాజకీయ వర్గాలను షేక్ చేస్తున్నాయి. ఆయన ఇప్పటికే ఎంపీ పదవికి రాజీనామా చేయడం, బీజేపీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవలే తాను జూన్ నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించడంతో రాజ్యసభ సీటు ఊహాగానాలు నిజమేనేమో అనిపిస్తోంది. అయితే, బీజేపీ అధిష్టానం స్థానిక నేతలకు ఇస్తుందా లేక బయటి వ్యక్తులను ప్రోత్సహిస్తుందా అనేది సస్పెన్స్‌గా మారింది. కూటమిలోని మూడు పార్టీల మధ్య ఎక్కడా అసంతృప్తి రాకుండా, సమన్యాయం ప్రాతిపదికన సీట్ల పంపకం ఉండాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. జూన్ నాటికి ఈ సమీకరణాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా, ఈసారి ఏపీ రాజ్యసభ ఎన్నికలు కేవలం అభ్యర్థుల ఎంపిక మాత్రమే కాదు.. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు ఒక పరీక్షగా నిలవనున్నాయి.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు

ఏలూరు, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద



ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు. మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.

అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

# నైరాశ్యంలో వైసీపీ నేతలు

నెల్లూరు ఫిబ్రవరి 10 (భారతశక్తి):

2024 ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు వైసీపీ లో స్పష్టమైన ఉత్సాహం కనిపించలేదు. నెక్స్ట్ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని భావించిన చాలా మంది నేతలు, ఇప్పుడే ఎందుకు బహిరంగంగా కదలాలన్న ఆలోచనలోనే ఉండిపోయారు. మరికొందరు మాత్రం పార్టీ కార్యక్రమాలకంటే తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడమే సరిపోతుందన్న భావనతో ముందుకు సాగారు. అందుకే గత 19 నెలలుగా పార్టీ పిలుపునిచ్చిన ఉద్యమాలు, నిరసనలకు పెద్దగా స్పందన కనిపించలేదు. పూర్తిగా దూరంగా కూడా ఉండకుండా, ప్రజల్లోకి వెళ్లినట్టు వెళ్లి, కార్యక్రమాలు జరిగాయన్న ముద్ర వేసినట్టే వ్యవహారం సాగింది. ఈ పరిస్థితిపై పార్టీ అధినేత జగన్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నేతల్లో చురుకుదనం రావాలని, ప్రజల మధ్య కలివిడిగా ఉండాలని సూచనలు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే ఇటీవల జరిగిన రెండు పరిణామాలు మాత్రం పార్టీ వాతావరణాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒక్కసారిగా నేతలంతా ఏకం కావడం మొదలైంది. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు వైసీపీ శ్రేణుల్లో కదలిక పెరిగింది. అంబటి రాంబాబు (, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరగడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా మారింది. ఈ ఘటనలను పార్టీ నేతలు తేలిగ్గా తీసుకోలేదు. ఇది కేవలం వ్యక్తిగత అంశం కాదని, తమ రాజకీయ స్వరాన్ని అణిచివేసే ప్రయత్నంగా భావించారు. ముఖ్యంగా కాపు, బీసీ వర్గాలను ఏకం చేయడం, పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించడం అవసరమని నాయకత్వం భావించింది. అందుకే ఈ అంశాలను భుజాన వేసుకుని, ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. గతాన్ని పరిశీలిస్తే, ఇలాంటి పరిస్థితి ఒకప్పుడు టీడీపీలో కూడా కనిపించింది. 2019 నుంచి 2021 మధ్య ఆ పార్టీలోనూ నైరాశ్య వాతావరణం నెలకొంది. సమావేశాలు పెట్టినా పెద్దగా స్పందన రాలేదు. అయితే నందిగామ )లో చంద్రబాబు నాయుడు పై రాళ్ల దాడి, పార్టీ కార్యాలయంపై దాడులు జరిగిన తర్వాత పరిస్థితి మారింది. అప్పటివరకు వెనుకంజలో ఉన్న నేతలు ఒక్కసారిగా ముందుకు వచ్చారు. పార్టీని, నాయకుడిని కాపాడుకోవాలన్న భావన వారిని ఏకం చేసింది. ఇప్పుడు అదే తరహా సమీకరణ వైసీపీలో జరుగుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. నేతలు వ్యక్తిగతంగా కాకుండా, సమష్టిగా పార్టీ కోసం నిలబడాలన్న భావన బలపడుతోంది. ఈ కదలిక ఎన్నికల వరకు ఎంతవరకు కొనసాగుతుంది, పార్టీకి ఎంత మేలు చేస్తుందన్నది కాలమే నిర్ణయించాలి. అయితే ప్రస్తుతం మాత్రం వైసీపీలో కనిపిస్తున్న ఐక్యత రాజకీయంగా కీలక సంకేతంగా మారిందని చెప్పాలి.

# 21 నియోజకవర్గాల్లో అభివృద్ధి సూపర్ గ్రేడింగ్‌లు ఇచ్చిన ప్రభుత్వం

విజయవాడ, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పనితీరు సూచీలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. వివిధ అభివృద్ధి ,సంక్షేమ సూచికల ఆధారంగా 175 నియోజకవర్గాల ర్యాంకింగ్స్ ఇచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అభివృద్ధి సూచికలు , సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తిని ప్రాతిపదికగా తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకుల్లో మెజారిటీ నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ (ఎ+) గ్రేడ్ సాధించగా, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడ్ దక్కించుకున్నాయి. కేవలం ఒకే ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌కు పరిమితం కావడం గమనార్హం. వీటిలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 13 నియోజకవర్గాలు రాష్ట్రానికి రోల్ మోడల్స్‌గా నిలిచాయి. రాష్ట్రంలోనే 93 శాతం మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. ఎమ్మెల్యే సుజనా చౌదరి మార్క్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, పారిశుధ్య నిర్వహణలో సాధించిన పురోగతి ఈ ర్యాంకు సాధనలో కీలక పాత్ర పోషించాయి. క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం , విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో సుజనా చౌదరి చూపిన చొరవ ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది. రెండవ స్థానంలో నిలిచిన గాజువాకకు 92 మార్కులు వచ్చాయి. నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి , స్థానిక మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. అలాగే, మూడవ స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ నగర నియోజకవర్గం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలులోనూ, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ మేటిగా నిలిచింది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కృషి స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గం కూడా పారిశుధ్యం, పౌర సేవలలో అద్భుతమైన స్కోరును సాధించింది. ఈ ర్యాంకింగ్స్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, ఎమ్మెల్యేల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడానికి దోహదపడుతున్నాయి. ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చు కావాలన్న ప్రభుత్వ సంకల్పం, ఈ ఫలితాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తోంది. ఏ ప్లస్ నియోజకవర్గాల స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా పాలనను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# ఏపీలో మరో అండర్‌పాస్

నెల్లూరు, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెం వెళ్లే జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం చేయనున్నారు. ఈ అండర్ పాస్‌ను ఏకంగా ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గతేడాది నవంబరులో మంజూరు చేసింది. అంతేకాదు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. ప్రస్తుతం భూసేకరణ చేపట్టారు. ఈ పనులు శరవేగంగా పూర్తిచేసి.. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ అండర్‌పాస్ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ అండర్‌పాస్ కోసం మొత్తం రూ.115.27 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అండర్‌పాస్ నిర్మాణానికి 3.57 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధుల్లో రూ.22 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. ఈ అండర్‌పాస్ కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అండర్‌సాస్ పనులు ప్రారంభించి.. దాదాపు 15 నెలల్లో పూర్తి చేయిస్తామని చెబుతున్నారు అధికారులు. అందుకే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు అధికారులు. ఈ అండర్‌పాస్‌ను చింతారెడ్డిపాళేనికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ జంక్షన్ నుంచి హరనాథపురం చివర కలిసే కృష్ణపట్నం రోడ్డు దగ్గర దాబా వరకు పనులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అండర్‌పాస్ ప్రస్తుతం సుమారు 2.12 కి.మీ. పొడవుతో ఉంది. ఇప్పుడు ఉన్న నాలుగు లైన్ల రోడ్డు స్థానంలో ఆరు వరుసల అండర్ పాస్ వచ్చేలా ప్లాన్ చేశారు.

# కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

వరంగల్, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న జిల్లాలను తొలగించడం కంటే, ఉన్నవాటిని పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని, ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు. జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని, కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

# కోట్లు కురిపిస్తున్న మేడారం హుండీలు

వరంగల ఫిబ్రవరి 10 (భారతశక్తి):

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు వచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఇక మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండకు తీసుకువచ్చి.. టీటీడీ కల్యాణ మండపంలో




గత గురువారం రోజున లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇవాళ్టికి గత 5 రోజులుగా హుండీలను లెక్కించే పనిలో దేవాదాయ శాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఇక ఐదోరోజు 163 హుండీలను లెక్కించిన అధికారులు ఇప్పటివరకు వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడించారు. ఒక్కరోజే 163 హుండీలను లెక్కించగా.. అందులో మొత్తం రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు గత 5 రోజుల్లో మొత్తం 788 హుండీలను లెక్కించినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో మొత్తంగా ఇప్పటివరకు రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇందులో మన దేశ కరెన్సీతోపాటు విదేశాలకు చెందిన నోట్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు 18 దేశాలకు చెందిన నోట్లు వచ్చాయని వెల్లడించారు. మిగిలిన హుండీల లెక్కింపు ప్రక్రియ కూడా ముమ్మరంగా సాగుతోందని ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. లెక్కింపు పూర్తి కావడానికి మరో రెండ్రోజుల సమయం పట్టవచ్చని సిబ్బంది అంచనా వేశారు. ఇప్పటివరకు డబ్బులు మాత్రమే లెక్కిస్తుండగా.. ఈ నోట్లు మొత్తం లెక్కించడం పూర్తి అయిన తర్వాత బంగారం, వెండి వస్తువులను వాటి బరువు ఆధారంగా విలువను నిర్ధరించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు.. మేడారం మహాజాతరలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయంలో 33 శాతాన్ని మేడారం పూజారులకు అందించనున్నారు. ఇక గతంలో నిర్వహించిన మహాజాతరలో సుమారు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే.. ఈసారి భారీగా పెరగనున్నట్లు దేవాదాయ శాఖ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. గతంతో పోల్చితే 3 రెట్లు అధికంగా హుండీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక మొత్తం హుండీల లెక్కింపునకు దాదాపు 10 రోజులకు పైనే సమయం పడుతుందని పేర్కొంటున్నారు. హుండీల్లో డబ్బులు, బంగారం, వెండి, ఇతర ఆభరణాలు, విదేశీ కరెన్సీ లెక్కింపు ఇంతా పూర్తి అయిన తర్వాత మొత్తం ఈసారి ఆదాయం ఎంత వచ్చింది అనేదానిపై అధికారిక ప్రకటన చేయనున్నారు. ఈ మహాజాతరలో భాగంగా గద్దెల ప్రాంగణంలో మొత్తం 828 హుండీలను ఏర్పాటు చేశారు. వాటిలో 780 ఇనుప హుండీలు కాగా.. 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక హుండీల్లో పాత రూ.500, రూ.1000 నోట్లు కూడా వస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు.. మరికొందరు భక్తులు పేపర్లు, నోట్లపై తమ కోరికలను రాసి వాటిని తీర్చాలంటూ సమ్మక్క సారలమ్మలను వేడుకున్నారు.

# తగ్గిన చికెన్, మటన్ ధరలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి):



పండుగల సీజన్, మేడారం జాతర ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు కొండెక్కగా.. ఇప్పుడు పండుగ సీజన్ ముగియడంతో ధరలు ఇప్పుడిప్పుడే దిగొస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో క్రిస్మస్ ఉండటం, ఆ తర్వాత కొత్త ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ రావడం, మేడారం జాతర జరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కేజీ చికెన్ రూ.350 వరకు తెలుగు రాష్ట్రాల్లో చేరుకుంది. కానీ ఇప్పుడు మెల్లమెల్లగా ధరలు తగ్గుతుండటంతో నాన్ వెజ్ ప్రియులు ఉపశమనం పొందుతున్నారు. జనవరి 8న సండే కావడంతో చికెన్‌కు డిమాండ్ ఉంటుంది. సెలవు కాకడంతో చికెన్ తినేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ధరలు తగ్గడం వీరికి కాస్త రిలీఫ్ ఇచ్చిందిప్రస్తుతం కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 240 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. ఇక డ్రెస్డ్ చికెన్ కిలో రూ.220 నుంచి రూ.230 వరకు ఉండగా.. లైవ్ చికెన్ రూ.118 నుంచి రూ.120కే లభిస్తుంది. మేడారం జాతర సమయంలో డిమాండ్ కారణంగా స్కిన్‌లెస్ చికెన్ రూ.350నుంచి రూ.380 వరకు కూడా వ్యాపారులు విక్రయించారు. ఇక డ్రెస్డ్ చికెన్‌ను రూ.350కు, లైవ్ కోడిని రూ.200 వరకు విక్రయించారు. జాతర ముగిసిన తర్వాత చికెన్ ధరలు ఢమాల్ అంటూ పడిపోయాయి. వారం రోజుల వ్యవధిలోనే రూ.100 తగ్గడంతో నాన్‌వెజ్ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పండుగ సీజన్ ముగియడంతో కోళ్లకు డిమాండ్ పడిపోయిందని, ధరలు తగ్గడానికి ఇదే కారణమని వ్యాపారుల చెబుతున్నారు. అలాగే కోళ్ల ఉత్పత్తి కూడా పెరగడం వల్ల ధరలు పడిపోతున్నాయని అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల ఫామ్స్‌లో ఉత్పత్తి బాగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. ఇక చికెన్ ధరలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత నెలలో ఏకంగా ఒక్కో కోడిగుడ్డు ధర రూ.10కు చేరుకుంది. రిటైల్ షాపుల్లో రూ.10కి విక్రయించారు. ఇప్పుడు కేవలం ఒక్కో గుడ్డు రూ.6కే షాపుల్లో అమ్ముతున్నారు. కోడిగుడ్ల ధరలు కూడా ఒకేసారి కుప్పకూలాయి. దీంతో సామాన్యులకు ధరల భారం తగ్గిందని చెప్పవచ్చు. ఇవాళ అసలే సండే కారణంతో చికెన్ షాపుల ముందు జనం క్యూ కడుతున్నారు. చికెన్ కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీంతో మాంసం దుకాణాలన్నీ కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. అటు మటన్ ధరలు కూడా పండుగ తర్వాత తగ్గాయి. పండుగ సమయంలో రూ.1500 వరకు పలకగా.. ఇప్పుడు రూ.800కే లభిస్తోంది.

# తగలబడిందా... తగలబెట్టేరా

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

============

# గులాబీ పరువు నిలిచేనా

హైదరాబాద్ ఫిబ్రవరి 10 (భారతశక్తి):

అధికారం ఉన్నప్పుడు ఏదైనా చేయవచ్చు. సాధ్యం కానిది కాళ్ల దగ్గరికి తెచ్చుకోవచ్చు. 2020 పురపాలక ఎన్నికల్లో గులాబీ పార్టీ ఇలానే చేసింది. అధికారాన్ని ఉపయోగించింది. అంగ బలాన్ని ప్రయోగించింది. అర్థాన్ని వాడింది. తద్వారా తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది. 2020లో జనవరి నెలలో పురపాలక ఎన్నికలు జరిగాయి. నాటి ఎన్నికల్లో 120 మున్సిపాలిటీలు.. 9 కార్పొరేషన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. నాటి ఎన్నికలలో గులాబీ పార్టీ సత్తా చూపించింది. 120 మున్సిపాలిటీలలో ఏకంగా 110 కంటే ఎక్కువ మునిసిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. 9 కి 9 కార్పొరేషన్లను గులాబీమయం చేసింది. మొత్తం 2727 వార్డులలో దాదాపు 70 శాతానికి దగ్గరగా స్థానాలను గులాబీ పార్టీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 500 వార్డులలో సత్తా చూపిస్తే.. బిజెపి 200 వార్డులలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 2020 పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యంత దయనీయమైన స్థితిలో ఉండేది. చాలా ప్రాంతాలలో రెండవ స్థానంలో నిలిచినప్పటికీ మునిసిపల్ పీఠాలను అందుకోలేకపోయింది. నాడు హుజుర్ నగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలో గులాబీ పార్టీ విజయం సాధించిన తర్వాత.. పురపాలక ఎన్నికలు వచ్చాయి. దీంతో గులాబీ పార్టీ సహజంగానే జోష్ మీద పాల్గొంది. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన కంచుకోటలను కూడా కాపాడుకోలేకపోయింది. పట్టణ ప్రాంతాలలో బిజెపి సత్తా చూపించినప్పటికీ.. అది కొన్ని ప్రాంతాలలో మాత్రమే ప్రభావం చూపించింది. 2020 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు సత్తా చూపించడం విశేషం. నాటి ఎన్నికల్లో గులాబీ పార్టీ కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చింది. దానిని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. అయినప్పటికీ అధికారాన్ని ఉపయోగించి గులాబీ పార్టీ ఇష్టానుసారంగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. వాటి ద్వారానే ఎన్నికలు జరిపింది. ఇక ఓటర్ల జాబితా గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇలా అన్ని రకాలుగా అధికార దర్పాన్ని ప్రయోగించి గులాబీ పార్టీ నాటి ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సాధించింది. ఇక ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి మరో విధంగా ఉంది. అధికార పార్టీగా కాంగ్రెస్ కొనసాగుతోంది. అప్పటి పురపాలక ఎన్నికల్లో కేటీఆర్, హరీష్ రావు ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు వారిద్దరూ కనిపించడం లేదు. అందువల్లే గులాబీ పార్టీ ఆత్మ రక్షణ ధోరణిలో పడిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# బండి వ్యూహం ఫలించేనా

కరీంనగర్ ఫిబ్రవరి 10 (భారతశక్తి):



తెలంగాణలో. ప్రచారం హోరాహోరీగా ముగిసింది ఇక 66 డివిజన్లు ఉన్న ఖరీంనగర్‌లో ఈసారి కాషాయ జెండా ఎగురవేయాలని ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోకస్ పెట్టారు. ప్రత్యేక శైలిలో ప్రచారంతో ముందుకు సాగుతున్నారు. డివిజన్‌ల వారీగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం పెంచుకుంటున్నారు. అవినీతి దూరం, నగరాభివృద్ధి హామీలతో ఓటర్లలో నమ్మకాన్ని నింపుతూ, పోటీని తీవ్రతరం చేస్తున్నారు. ప్రతి డివిజన్‌లో బండి సంజయ్ నిర్వహిస్తున్న చిన్న సమావేశాలు ప్రచారానికి కొత్తగా ఉంటున్నాయి. రోడ్డు పక్కనే జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజల సమస్యలను విని, తమ అభ్యర్థులను పరిచయం చేస్తున్నారు. ఇది పార్టీకి క్షేత్ర స్థాయిలో బలోపేతాన్ని తీసుకువస్తోంది. సాధారణ ప్రచారాలకు భిన్నంగా, ఈ విధానం ఓటర్లలో సానుకూలతను పెంచుతోందిగెలిచాక అవినీతికి పాల్పడమని అభ్యర్థులు ప్రజల సాక్షిగా ప్రమాణం చేయించడం సంజయ్ ప్రత్యేక ఎత్తు. ఈ చర్య ఓటర్లలో పారదర్శకత, జవాబుదారీతనం భావాలను రేకెత్తిస్తోంది. ప్రజల ముందు ఇలాంటి ప్రతిజ్ఞలు రాజకీయ విమర్శలకు బలమైన జవాబుగా మారాయి. ఇది పోటీ అభ్యర్థులకు సవాలుగా నిలిచి, బీజేపీ అజెండాను బలపరుస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నారు. ఇది స్థానిక సమస్యలైన మౌలిక సదుపాయాలు, పరిశీలన, రోడ్లు వంటి అంశాలపై దృష్టి పెడుతోంది. ప్రజలతో మమేకమైన వాతావరణం సృష్టించి, ఈ హామీలను వాస్తవికంగా చూపిస్తున్నారు. ఇది ఓటర్లలో ఆశలు నింపుతూ, పార్టీకి ఆదాయం తీసుకువస్తుందని అంచనా. సంజయ్ వ్యూహం కరీంనగర్ ఎన్నికల్లో పోటీని మరింత ఉత్కంఠ పెంచింది. అవినీతి వ్యతిరేక చిత్రణ, అభివృద్ధిపై ఫోకస్ బీజేపీ అభ్యర్థులకు ప్లస్‌గా మారుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలు ఈ దూకుడుకు సమాధానాలు తీసుకోవాల్సి వచ్చింది. ఫలితాలు బీజేపీ క్షేత్ర స్థాయి బలాన్ని, సంజయ్ నాయకత్వాన్ని పరీక్షిస్తాయి.

# నా చావుకు భార్య, అత్తా, మామలతో పాటు రమణారెడ్డి అనే వ్యక్తి కారణం సాఫ్ట్వేర్ ఇంజనీర్ సీతారాం రెడ్డి.

నా చావుకు భార్య, అత్తా, మామలే కారణమంటూ ఓ వ్యక్తి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లేక్‌పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేకరు.. మార్కాపురానికి చెందిన సీతారాంరెడ్డి (36), రేణుక దంపతులు బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. గతంలో భార్య రేణుక ఇన్‌స్టాగాంలో పరిచయమైన వ్యక్తితో ఇంట్లో నుంచి వెళ్లిపోయి కొద్దిరోజుల తరువాత వచ్చింది. అప్పటి నుంచి ఆమె ఇంట్లోనే ఉంటోంది. అయితే గత జనవరి నెల 24 న మళ్లీ అదృశ్యమైంది. భార్య కనిపించకుండా పోవడంతో ఆమె తల్లిదండ్రులు బాచుపల్లికి వచ్చి ఇక్కడికే ఉంటున్నారు. అత్తామామలు ఆదివారం పిల్లలను తీసుకుని సొంత ఊరు నంద్యాలకు వెళ్లిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన సీతారాంరెడ్డి ఆదివారం సాయంత్రం హుస్సేన్ సాగర్‌లో దూకాడు. సోమవారం ఉదయం నుంచి హైడ్రా, లేక్ పోలీసులు గాలించగా సాయంత్రం మృతదేహం బయటపడింది.

# కడప జిల్లాలో టూరిస్టు బస్సు బోల్తా తప్పిన పెనుప్రమాదం

కడప ఫిబ్రవరి 10 (భారతశక్తి):

కడప జిల్లాలో పెనుప్రమాదం తప్పింది. 40 మంది భక్తులతో వెళుతున్న టూరిస్టు బస్సు జమ్మలమడుగు - కన్యతీర్థం ప్రధాన రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తొమ్మిది మంది భక్తులు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రైవేటు బస్సులో 40 మంది భక్తులు జమ్మలమడుగు మండలం కన్యతీర్థం దర్శనానికి వెళ్లారు అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని ఆలూరు రంగనాయకుల కోనకు బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తగుంటపల్లె సమీపంలోని మలుపు వద్ద బస్సు స్టీరింగ్ అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన తొమ్మిది మంది భక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు

# అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 10 (భారతశక్తి):

అశ్వరావుపేట నూతన మున్సిపాలిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 22 వార్డులకు జరుగుతున్న ఎన్నికల్లో 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి రిటర్నింగ్ అధికారితో సహా ఐదుగురు సిబ్బందితో మొత్తం 175 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 35 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు.ఆూఖ, అఎ, నలుగురు ఎస్సైలు, ఒక స్పెషల్ పార్టీ తో కలిపి మొత్తం 125 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.ఎన్నికల దృష్ట్యా మున్సిపాలిటీ మొత్తం పరిశీలించిన పోలీసులు 12 సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించారు. 1,2,7,9,10, 11, 22 వార్డులకు చెందిన 12 పోలింగ్ కేంద్రాలలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాలకు అదనపు బలగాలను నియమించారు.రేపు ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకూ ఓటింగ్ జరగనుంది.ఈ 13వ తేదీ ఉదయం 8 గంటల నుండి వ్యవసాయ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది.

# ఒంగోలు చేరిన సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

ప్రకాశం ఫిబ్రవరి 10 (భారతశక్తి):

తీర ప్రాంత రక్షణపై ప్రజల్లో అవగాన కల్పించే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైక్లోథాన్ ప్రకాశం జిల్లా ఒంగోలు చేరింది. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సైక్లోథాన్ కు జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ స్వాగతం పలికారు. సైక్లోథాన్ లో పాల్గొన్న వారికి హారతులు ఇచ్చి జై భారత్ మాతా నినాదాలతో పోలీసు బ్యాండ్ తో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైక్లోథాన్ కు కమాండెండ్ గా వ్యవహరిస్తున్న సంజీత్ మాట్లాడుతూ, తీర ప్రాంత ప్రజల్లో మత్తు పదార్దాలు, అక్రమ ఆయుధాల చొరబాటు వంటి వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ నెల 7వ తేదీన పశ్చిమ బెంగాల్ లో ఈ సైక్లోథాన్ ప్రారంభమైందన్నారు. మొత్తం 60 మంది సభ్యులు ఉన్న ఈ బృందంలో మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ, సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ద్వారా తీర ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇది ఒక మంచి ప్రయత్నమన్నారు.

# జిల్లాల పి4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, ఫిబ్రవరి 10(భారత శక్తి) : దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న పీ4 కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయడంతో పాటు అన్ని శాఖలు అన్ని పేరామీటర్లలో.. వందశాతం పురోగతిని సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.



రాష్ట్ర రాజధాని అమరావతి నుండి జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల సమీక్షతో పాటు 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన కార్యాచరణపై సంబంధిత కార్యదర్శులు, మంత్రులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు.సాయంత్రం ముఖ్యమంత్రి విని ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు జిల్లాలో పేదరిక నిర్మూలనకు చేపడుతున్న పీ4 లక్ష్యాన్ని 2029 నాటికి సాకారం చేసేలా జిల్లాలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ''పేదరిక నిర్మూలనలో భాగంగానే పీ4 కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని.. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆశయం మేరకు జిల్లాలో పీ4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు డిఆర్డీఏ, మెప్మా, వయోజన విద్య మొదలైన శాఖలు సమన్వయంతో సర్వే నిర్వహించాలన్నారు. జిల్లాలో సంపూర్ణ అక్షరాశ్యత శాతాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి.. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాలకు ఆదాయ వనరులను కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు.

ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, ఫైళ్ల భద్రత కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నెల 15వ తేదీ నుండి ఈ-ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతి శాఖ వారి పరిధిలోని డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అన్ని కార్యకలాపాలకు సంబంధించిన డేటాను స్కాన్డ్ డాక్యుమెంట్ రూపంలో భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు.

అన్ని అంశాల్లో కూడా జాతీయ స్థాయిలో జిల్లా మంచి స్థానంలో ముందుకు సాగుతోందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, రాష్ట్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా అన్ని పేరామీటర్లలో 100% పురోగతిని సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, సీపీవో హాజరతయ్య, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, డిఆర్డీఏ, మెప్మా,, డ్వామా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, అదిశేషారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్ర నాయక్, ఎల్డిఎం జనార్ధనం వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణ పరిశీలన

## శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు

శ్రీశైలం ఎ ఫిబ్రవరి 10 (భారతశక్తి):



శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు.దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ( డి ఎఫ్ ఎం డి లు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు.మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అదనంగా చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

====================================

# విదేశాల్లో వెల్డింగ్ ఉద్యోగ అవకాశాలు- అవగాహన సదస్సు

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 10(భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృది సంస్థ , ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సంయుక్తంగా రాయలసీమ ప్రాంతం లోని నిరుద్యోగ యువత కోసం, ఇతర దేశాల్లో వెల్డింగ్ మరియు నిర్మాణ రంగం నందు ఉద్యోగ అవకాశాలు మీద అవగాహన సదస్సు ను ఈ నెల 12 న గురువారం రోజున ఉదయం 10.30 గంటలకు పులివెందుల లోని నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ నందు నిర్వహించడం జరుగు తుందని జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.వెల్డింగ్ మరియు నిర్మాణ రంగం నందు విదేశాల్లో శిక్షణ ఇచ్చే సాఫ్కో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మరియు అసెస్మెంట్ వారి ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించ బడునని తెలిపారు.ఈ కార్యక్రమానికి 10వ తరగతి/ఐటీఐ/డిప్లొమా/ఇంజనీరింగ్ చదివి 19 సం॥ నుండి 45 సం॥ వయస్సు గల అభ్యర్థులు హాజరు అయ్యి సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు నాక్ బిల్డింగ్, పులివెందుల నందు లేదా 9000517637, 9701271158 ను సంప్రదించగలరని ఆ ప్రకటన లో తెలిపారు.




# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి జోన్ లో నిషేధాజ్ఞలు

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10:

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు శేరిలింగంపల్లి జోన్ డిసిపి సీ. హెచ్. శ్రీనివాస్ తెలిపారు.

మున్సిపల్ పోలింగ్ 2026 ఫిబ్రవరి 11వ తేదీన జరగనున్న నేపథ్యంలో, బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 163 ప్రకారం ఐదుగురికి గుమికూడవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఐ డి ఏ బోలారం, పటాన్ చేరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని గడాపోతారం మున్సిపాలిటీలోని చెట్లపోత్రం, ఖాజిపల్లి, మధారం, కిస్తైపల్లి గ్రామాల్లో ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి. ఇంద్రేశం, ఐనోల్, రామేశ్వరంబండా, బాచుగూడెం, చిన కంజెర్ల, పెద్ద కంజెర్ల గ్రామాల్లో ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి; ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని చిట్కూల్, ఇస్నాపూర్, రుద్రారం, లక్దారం గ్రామాల్లో ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి.

పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమయంలో పోలింగ్ కేంద్రాల సమీపంలో ప్రజా సమావేశాలు, గుమికూడడాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఉల్లంగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిషేధాజ్ఞలు

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోన్‌లో నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు కుత్బుల్లాపూర్ జోన్ ఇన్ చార్జీ డీసీపీ సాయి మనోహర్ తెలిపారు.

మున్సిపల్ పోలింగ్ 2026 ఫిబ్రవరి 11వ తేదీన జరగనున్న నేపథ్యంలో, దీయీూా సెక్షన్ 163 ప్రకారం ఐదుగురికి మించి గుమికూడవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ఈ నిషేధాజ్ఞలు మేడ్చల్, జీనోమ్ వ్యాలీ (అలియాబాద్, ఎంసీ పల్లి) పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో అమలులో ఉంటాయని తెలిపారు.

ఈ నిషేధాజ్ఞలు 2026 ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమయంలో పోలింగ్ కేంద్రాల సమీపంలో ప్రజా సమావేశాలు, గుమికూడడాలు పూర్తిగా నిషేధమని తెలిపారు.

ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్ చార్జీ డీసీపీ హెచ్చరించారు.

# గోడపత్రాల ఆవిష్కరణ



కడప, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10:

కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో యూరియాను అధికంగా వాడటం వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ వారు ప్రచురించిన గోడపత్రాలను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీ మీనా, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డివవో చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సామగ్రి క్రమబద్ధంగా అందేలా చూడాలి

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారతశక్తి): పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి క్రమబద్ధంగా అందేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి పాఠశాల ఆవరణలో, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలు సజావుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి బ్యాలెట్ బండిల్‌పై సీల్, అధికారుల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లు, ఎన్నికల సామగ్రి సరఫరా వ్యవస్థ, రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు తదితర అన్ని మౌలిక సదుపాయాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేదా గందరగోళానికి తావులు లేకుండా, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సామగ్రి అందిందా లేదా జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బంది నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. అలాగే, పోలింగ్ సామగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లను తరలించే సమయంలో సాయుధ పోలీసు బందోబస్తు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన సందర్భంలో వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత ఎన్నికల అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి.!

**-పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు**
**-ఓటర్లు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.**
**-జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారతశక్తి): జిల్లాలో నేడు జరిగే మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు--1,34,775 మంది ఓటర్లు, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు -- 16,850 మంది ఓటర్లు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు -- 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని చెప్పారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,036 మంది ఇతర పోలింగ్ అధికారులు (రిజర్వ్‌తో కలిపి) నియమించామని చెప్పారు. అదేవిధంగా 48 మంది రిటర్నింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని, కౌంటింగ్ సిబ్బందిని ముందుగానే గుర్తించి అవసరమైన శిక్షణ అందించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి నోటిఫై చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇల్లందు మున్సిపాలిటీకి సింగరేణి కమ్యూనిటీ హాల్ (24 ఏరియా), అశ్వారావుపేట మున్సిపాలిటీకి వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేటలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంగణాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు సహా ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ కోసం ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీలు) ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉన్నాయని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేడు పోలింగ్ జరిగే మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

**-ఎన్నికల సజావుగా జరుగుటకు ప్రజలు సహకరించాలి**
**-ఉదయం 7.00 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఎన్నికలు**
**-ఏదేని గుర్తింపు కార్డుతో పోలింగ్ బూతుకు రావాలి**
**-ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 10:

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా,నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని, జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలో ఉదయం 7.00 గంటల నుండి పోలింగ్ ప్రారంభం అయి సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందని తెలిపారు ఈ నెల 11వ, తేది (బుధవారం) రోజున ఎన్నికల జరుగనున్న సందర్భంగా పోలింగ్ బూతుల వద్ద ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకు నేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చే సమయంలో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి అనగా ఓటర్ కార్డు,ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు,ఫోటో కూడిన పోస్టు ఆఫీసు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్,పాన్ కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్ పోర్టుతొ జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు అలాగే అధికారిక గుర్తింపు కార్డులు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఓటు హక్కును నూరు శాతం వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తొడ్పాటును అందించాలన్నారు.జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 141 వార్డులలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. పోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 446 పోలింగ్ అధికారులు, 446 ఏపీఓ, 1340 ఓపిఓ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల సజావు నిర్వహణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు నియమించామన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు 10 ఎస్ఎస్ టీ, 15 ఎఫ్ ఎస్ టీ, 7 వీవీటి, ఏటి 7బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీదారుల వ్యయ నియంత్రణకు 5 గురు ఏఇఓ లు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. 55 మంది మైక్రో అబ్జర్వార్లను నియమించినట్లు కలెక్టర్ అన్నారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్ కు తరలింపుకు 46 బస్సులను సిద్ధం చేసినట్లు, పోలీస్ ఎస్కార్టుతో బందోబస్తుకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛ, న్యాయబద్ధంగా జరిగేలా అన్ని వర్గాల వారు సహకరించాలని కలెక్టర్ కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ లు జనరల్ అబ్జర్వర్ పాండదాస్ తో కలిసి ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు.వీరి వెంట ఆర్డిఓ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

## 12న సమ్మెలో పాల్గొనాలని జేఏసీ విస్తృత ప్రచారం



మణుగూరు, ఫిబ్రవరి 10 (భారతశక్తి): ఈనెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని మణుగూరు ఏరియా ప్రజల కోసం కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొండాపురం సిఎస్ పి, కేపియూజి, జీఎం కార్యాలయంలో గేట్ మీటింగ్ జేఏసీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికులను నిరాయుధలను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామికవేత్తలు కార్పొరేటర్లకు అనుగుణంగా మార్పులు తీసుకొచ్చారని ఆరోపించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడులను రద్దు చేయాలని విద్యుత్తు సవరణ చట్టం, 2025 విబిజి రాంజీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక, ప్రజా, రైతు ,వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వై రాంగోపాల్, ఆవుల నాగరాజు,ఐఎన్టియుసి నాయకులు వి కృష్ణంరాజు, షేక్ అబ్దుల్ రవూఫ్,సిఐటియు నాయకులు వి వెంకటరత్నం, నరేష్, టీబీజీకేఎస్ నాయకులు మస్తాన్, ఐఎఫ్టియు నాయకులు ఏ చంద్రం, మంగీలాల్, సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 20 వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు: జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారతశక్తి):

జిల్లాలోని పత్తి రైతులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2025--26 సీజన్‌కు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లాలో పత్తి కొనుగోళ్ల జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఈ నెల 20 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల రైతులు తమ పత్తిని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు. సీసీఐ ద్వారా ఇప్పటికే కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడంలో కొంత ఆలస్యం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ నెల 21 నుండి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేయబడతాయని తెలిపారు. మిగిలిన కాలవ్యవధిని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

# బాల్య వివాహా రహిత సమాజమే లక్ష్యం



మణుగూరు, ఫిబ్రవరి 10 (భారతశక్తి): బాల్య వివాహా రహిత సమాజమే లక్ష్యమని ఏఐడీ సంస్థ కమ్యూనిటీ సోషల్ మొబలైజర్ నాగుల జ్యోతి పేర్కొన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆలయన్స్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మణుగూరు శ్రీ రామకృష్ణ విద్యాలయం నందు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా బాల్య వివాహల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా అని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారమని, అనాదిగా కొనసాగుతున్న ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు కోరారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందన్నారు. కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయన్నారు. ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని డైరెక్టర్ శృతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఎం ఎల్ హెచ్ పి తేజస్విని, ఏఎన్ఎం నాగజ్యోతి, ఐసిడిఎస్ టీచర్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకై పకడ్బందీ ఏర్పాట్లు: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఫిబ్రవరి10:




మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1100 పైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డిసిపిలతో పాటు ఐదుగురు అదనపు డిసిపిలు4మంది, ఏసిపిలు 11మంది, ఇన్స్పెక్టర్లు125 మంది, ఎస్.ఐలు 113 మంది, ఏ.ఎస్.ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు 515, హోంగార్డ్స్ 226 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సుమారు 168 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని. ఎన్నిక వేళ అదనపు డిసిపి స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మున్సిపల్ పరిధిలో ఒక ఏసిపి స్థాయి అధికారిని ఇంచార్జ్‌గా వుంటారని. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్.ఐ/ఏ.ఎస్.ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లుగా సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# దళితులపై జరుగుతున్న హత్యలపై విచారణ జరపండి: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాదరావు



పోరుమామిళ్ల, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10: మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ వారిని కలిసిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాదరావు దళితులపై వరుసగా జరుగుతున్న హత్యలు,దౌర్జన్యాలు దాడులు పైన ఎస్సీ కమిషన్ చైర్మన్ కలిసి వెంటనే ఒక కమిటీని వేసి జిల్లా కలెక్టర్ వారి ద్వారా, సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ కడప ద్వారా విచారణ జరిపించమని కోరారు. బ్రహ్మంగారిమఠం లో జరిగిన జంట హత్యల కేసు పై దళితులకు జరుగుతున్న అన్యాయం పై ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు దీనిపై కడప జిల్లాలో పర్యటించి తగు న్యాయం చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే ఎస్ జవహర్ హామీ ఇచ్చారు.

# నేడు జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధం

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10

జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో ఈ నెల 11న (బుధవారం) నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు చేపట్టారు.ఈ ఎన్నికలు సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్--జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో జరగనున్నాయి.జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉండగా, వాటికి గాను 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసారు.మొత్తం 3,41,808 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు. వారిలో పురుషులు -- 1,71,151,మహిళలు -- 1,70,638,ఇతరులు -- 19.మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలుఆందోల్--జోగిపేట్ : 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు 16,450 మంది ఓటర్లుగడ్డపోతారం : 18 వార్డులు 18 పోలింగ్ కేంద్రాలు 11,983 ఓటర్లుగుమ్మడిదల : 22 వార్డులు 44 పోలింగ్ కేంద్రాలు 23,926 ఓటర్లుఇంద్రేశం : 18 వార్డులు 19 పోలింగ్ కేంద్రాలు 13,086 ఓటర్లుఇస్నాపూర్ : 26 వార్డులు 60 పోలింగ్ కేంద్రాలు 35,912 ఓటర్లుజిన్నారం : 20 వార్డులు 22 పోలింగ్ కేంద్రాలు 12,473 ఓటర్లుకోహిర్ : 16 వార్డులు 16 పోలింగ్ కేంద్రాలు 10,832 ఓటర్లునారాయణఖేడ్ : 15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు 17,675 ఓటర్లుసదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 ఓటర్లుసంగారెడ్డి : 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 ఓటర్లుజహీరాబాద్ : 37 వార్డులు 121 పోలింగ్ కేంద్రాలు 78,819 ఓటర్లుపోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో 103 మంది రిటర్నింగ్ అధికారులు,103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు,649 మంది ప్రిసైడింగ్ అధికారులు,649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు,1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు,73 మంది మైక్రో అబ్జర్వర్లు , 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు.

ప్రశాంతంగా, సురక్షితంగా పోలింగ్ జరిగేలాశాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భైంసా లో రూట్ మార్చ్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారత శక్తి):మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల భైంసా పట్టణంలో నిర్వహించిన రూట్ మార్చ్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిసరాలు, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.రూట్ మార్చ్ ద్వారా ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.ఈ రూట్ మార్చ్ లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, శివంగి మహిళా బృందం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఉన్నత విద్యలో మూల్యాంకనంపై ఎఫ్.డీ.పీ. ప్రధాన వక్తలుగా డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, డాక్టర్ శ్వేతా ముఖర్జీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10 :



హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఉన్నత విద్యలో మూల్యాంకనం'పై రెండు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్.డీ.పీ)ని ఈనెల 13-14 తేదీలలో నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఇంటెన్సివ్, ఆచరణాత్మక కార్యశాలలో అన్ని విభాగాలలోని అధ్యాపకులను ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా ప్రభావవంతమైన, ఫలిత-ఆధారిత అంచనా పద్ధతులను రూపొందించడానికి, అమలు చేయుడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలియజేశారు.కృత్రిమ మేధస్సు (ఏఐ), హైబ్రిడ్ అభ్యాస వాతావరణాల సవాళ్లకు ప్రతిస్పందిస్తూ, ఈ కార్యక్రమం విమర్శనాత్మక ఆలోచన, వాస్తవికత, అర్థవంతమైన విద్యార్థుల అభ్యాసాన్ని ప్రోత్సహించే ప్రామాణికమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అంచనా వ్యూహాలపై దృష్టి సారిస్తుందన్నారు. ఎఫ్.డీ.పీ. రూబ్రిక్ అభివృద్ధి, మూల్యాంకన రూపకల్పన, డిజిటల్ సాధనాల వాడకంపై ముఖాముఖి కార్యక్రమాల మేలు కలయికగా ఇది కొనసాగుతుందని తెలిపారు.బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాయంలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, బెంగళూరు ప్రాంగణంలోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్ ఛార్జ్ డైరెక్టర్ డాక్టర్ శ్వేతా ముఖర్జీ ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా వ్యవహరిస్తారన్నారు. ఈ రెండు రోజులు అధ్యాపక వికాస కార్యక్రమం ముగిసే సమయానికి, ఇందులో పాల్గొన్నవారంతా కోర్సు అభ్యాస ఫలితాలతో అనుసంధానించబడిన నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక, ప్రామాణికమైన మూల్యాంకనాలపై ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందుతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10:



జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్టాంగ్ రూమ్ లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్యసందర్శించారు.మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేట లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు,ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు.పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు.అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

## నిర్లక్ష్యంపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారత శక్తి):భైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే




అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం భైంసాలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జనరల్ అబ్జర్వర్ వీరా రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో వెళ్తున్న అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేసారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# సినిమా

## ఖుషీ అవుతున్న కీర్తి సురేశ్ ఫ్యాన్స్!



హీరోయిన్ గా ఛాన్స్ రావడమే కష్టం .. ఇక ఆ సినిమా హిట్ కొట్టేసి స్టార్ డమ్ దక్కడం మరింత కష్టం. అయితే ఈ విషయంలో కీర్తి సురేశ్ పెద్దగా కష్టపడలేదు. చాలా తేలికగా ఆమె వరుస విజయాలను అందుకుంటూ వెళ్లింది. స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పడం మొదలుపెట్టేసింది. అయితే మొదటి నుంచి కూడా ఆమె తమిళ సినిమాలకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం మనకి కనిపిస్తుంది. ఈ కారణంగా తెలుగు ప్రాజెక్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కీర్తి సురేశ్ ప్లానింగ్ కారణంగా తెలుగులో గ్యాప్ లేకుండా చేయలేకపోయింది. 'దసరా' తరువాత ఆమె తెలుగులో పెద్దగా సినిమాలు చేయలేకపోయింది. తమిళంలో మాత్రం ఆమె మార్కెట్ బాగానే ఉంది. తెలుగులో ఆమె ప్రాజెక్టులు .. నిర్ణయాల విషయంలో అభిమానులు మాత్రం కాస్త అసంతృప్తిగానే ఉన్నారు. ఆమె నుంచి సరైన సినిమా రాలేదనే అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె విజయ్ దేవరకొండ జోడిగా 'రౌడీ జనార్దన' సినిమాను ఒప్పేసుకుంది. విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేశ్ తొలిసారిగా చేస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్టుకి ఒక్కసారిగా బజ్ వచ్చేసింది. తెరపై ఈ జోడీ చాలా బావుంటుందని ఫ్యాన్స్ అంటున్నారు. అటు విజయ్ దేవరకొండకి .. ఇటు కీర్తి సురేశ్ కి కూడా ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇక ఈ సినిమాలో రాజశేఖర్ ఓ కీలకమైన పాత్రను చేయనున్నారని అంటున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా, డిసెంబర్లో థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

## ఐశ్వర్య రాజేశ్ ఓటీటీ సినిమాల్లో క్రేజ్ తగ్గని క్రైమ్ థ్రిల్లర్!



అటు తమిళంలోను .. ఇటు తెలుగులోను ఐశ్వర్య రాజేశ్ కి మంచి క్రేజ్ ఉంది. ఓటీటీలలో ఐశ్వర్య రాజేశ్ సినిమాలను మళ్లీ మళ్లీ చూసేవారున్నారు. ఆమె ఎంచుకున్న కథలు .. పాత్రలు .. ఆ పాత్రలలో ఆమె జీవించే విధానమే అందుకు కారణమని చెప్పుకోవాలి. అలా ఆమె చేసిన సినిమాలలో ఓటీటీ వైపు నుంచి ఎక్కువ ఆదరణ పొందినవిగా ఫర్హానా .. డ్రైవర్ జమున .. సొపన సుందరి .. రన్ బేబీ రన్ కనిపిస్తాయి. అయితే వాటి సరసనే కనిపించే మరో సినిమాగా 'థిట్టమ్ ఇరాండు' గురించి చెప్పుకోవచ్చు. 'థిట్టమ్ ఇరాండు' అంటే రెండో వ్యూహం అనే అర్థం ఉంది. అందువల్ల 'ప్లాన్ బి' అనే టైటిల్ తోను ఈ సినిమా ఓటీటీలో కనిపిస్తోంది. తెలుగులోనూ అందుబాటులో ఉంది. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా ఐశ్వర్య రాజేశ్ కనిపిస్తుంది. 2021లో రూపొందిన ఈ సినిమాను, క్రైమ్ థ్రిల్లర్ లను ఇష్టపడేవారు ఓటీటీలో సెర్చ్ చేసి మరీ చూడొచ్చు. కథలోకి వెళితే .. పోలీస్ ఆఫీసర్ 'అధీర' కొత్తగా ఆ సిరీకి వస్తుంది. డ్యూటీలో చేరిన తొలి రోజులలోనే, ఆమె చిన్ననాటి స్నేహితురాలు దీపాసూర్య అదృశ్యమవుతుంది. ఆ తరువాత కాలిపోయిన ఒక కారులో ఆమె మృతదేహం దొరుకుతుంది. ఆమె భర్త కిశోర్ తమకి శత్రువులెవరూ లేరని అధీరాతో చెబుతాడు. ఈ మిస్టరీని అధీరా ఎలా ఛేదిస్తుంది? అనేది కథ. ఆడియన్స్ గెస్ చేయని ట్విస్ట్ తో సాగే ఈ సినిమాను ఒకసారి ట్రై చేయవచ్చు.

## చాలెంజింగ్ రోల్




ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్ లో మోస్ట్ అవైటెడ్ సినిమా 'వారణాసి'. సూపర్ స్టార్, ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ పై ఆడియన్స్ ఎంతో క్యూరియాసిటీగా ఉన్నారు. ఈ మూవీలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా సందడి చేయనుండగా.. మరో పవర్ ఫుల్ పాత్ర కుంభ. ఈ రోల్ లో మలయాళీ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ విపరీతంగా ఆకట్టుకుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ 'వారణాసి' మూవీపై ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ''కుంభ' రోల్ సవాలుతో కూడుకున్నది. ఇది నేను చేసిన, రాజమౌళి ఊహించిన అత్యంత క్లిష్టమైన పాత్ర. కుంభ చెప్పే, చేసే ప్రతీది గతంతో ముడిపడి ఉంటుంది. ముఖం, కళ్లతోనే నా భావోద్వేగాలను తెలియజేయాలి. సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న. ప్రతి క్యారెక్టర్ తెరపై ఎలా కనిపించాలో స్పష్టత కలిగిన దర్శకుడు రాజమౌళి' అంటూ ప్రశంసించాడు.

## డెలివరీ డేట్ ఫిక్సయిందిలా!



రామ్ చరణ్ భార్య ఉపాసన తమ కవలల జననం వెనుక ఉన్న పరిణామాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. ప్రసవం తర్వాత ఆమె విడుదల చేసిన వీడియోలో, పిల్లలు సురక్షితంగా పుట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు వెల్లడించింది. జననానికి సరైన తేదీ, సమయాన్ని జ్యోతిష్యుడి సూచనలతో నిర్ణయించినట్లు వీడియోలో వెల్లడైంది. జనవరి 31 రాత్రి 11.30 తర్వాత సమయం అనుకూలమని చెప్పారు. ఈ ప్రక్రియలో వైద్యులు, నర్సులు పూర్తిగా సహకరించారని, కుటుంబం కూడా ఆధ్యాత్మికంగా బలంగా నిలిచిందని ఉపాసన పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని ఆదరించిన ప్రేమకు ధన్యవాదాలు చెప్పారు. అభిమానులు పిల్లల భద్రతను గౌరవించాలని కోరారు. కవలల జననం తర్వాత రామ్ చరణ్, ఉపాసన తొలిసారిగా స్పందించారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె పుట్టడం సంతోషాన్నిచ్చిందని తెలిపారు. జీవితాల్లో మహిళలే పెద్ద బలం అని పేర్కొన్నారు. రామ్ చరణ్, ఉపాసన 2012లో వివాహం చేసుకున్నారు. 2023లో వారికి తొలి సంతానం క్లిన్ కారా జన్మించింది. ఇప్పుడు వారికి ఇద్దరు కూతుళ్లు.. ఒక కుమారుడు.

## మీ ప్రేమకు థ్యాంక్స్!



కన్నడ, తెలుగు నటి ఆశికా రంగానాథ్ తాజాగా ఎర్ర చీరలో తీసుకున్న ఫోటోను షేర్ చేశారు. సాదాసీదా నవ్వు, పొడవాటి వంకర జుట్టుతో ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంది. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న గాథ వైభవం సినిమాకు వస్తున్న స్పందనపై ఆశికా ఆనందం వ్యక్తం చేసింది. డీఎంలకు, ట్వీట్లకు అందరికీ స్పందించలేకపోయినా, వస్తున్న ప్రతి ప్రేమను చూస్తున్నానని తెలిపింది. మంగళ అలియాస్ తులసి పాత్రకు లభించిన ఆదరణ తన మనసును నింపిందని పేర్కొన్నారు. గాథ వైభవం ఎప్పటికీ ప్రత్యేకమని అన్నారు. 1996 ఆగస్టు 5న కర్ణాటకలోని హాసన్‌లో జన్మించిన ఆశికా, 2016లో క్రేజీ బాయ్ సినిమాతో నటిగా పరిచయమైంది. మధగజ (2021) చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమాకు సీమా అవార్డు కూడా దక్కింది. అవతార పురుష, నా సామి రంగ, ఓ2 చిత్రాలతో తన స్థానం పదిలం చేసుకుంది. ప్రస్తుతం ఆశికా పాన్ ఇండియా స్థాయిలో బిజీగా ఉంది. 2026లో రవితేజతో భర్త మహాశయులకు విజ్ఞప్తి, చిరంజీవితో విశ్వంభర, కార్తితో సర్దార్ 2 సినిమాలు లైన్లో ఉన్నాయి.

## ఇక నుంచి అన్నపూర్ణ స్టూడియోస్ లో అత్యాధునిక డాల్బీ అట్మాస్ సౌండ్ మిక్సింగ్

తెలుగు సినిమా రంగానికి అత్యాధునిక సాంకేతికతను అందించే దిశగా అన్నపూర్ణ స్టూడియోస్ మరో కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ఏర్పాటు చేసిన డాల్బీ అట్మాస్ 7.1.4 హెచ్‌ఈ మిక్స్ ఫెసిలిటీని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ నూతన సదుపాయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, "సినిమాకు సౌండ్ ప్రాణం లాంటిది. టెక్నాలజీ మారేకొద్దీ మనం కూడా అప్‌డేట్ అవ్వాలి. అందుకే మా విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ ఫెసిలిటీని ఏర్పాటు చేశాం. ఇది వారి భవిష్యత్తుకు



ఎంతగానో ఉపయోగపడుతుంది" అని తెలిపారు. సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, "సౌండ్ సినిమాకి ఆత్మ వంటిది. కథలోని భావోద్వేగాలను ప్రేక్షకులకు మరింత చేరువ చేయడంలో సౌండ్ స్కేప్ కీలక పాత్ర పోషిస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ విద్యార్థులు ఈ టెక్నాలజీని ఉపయోగించి సౌండింగ్‌లో సరికొత్త ప్రయోగాలు చేస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ డాల్బీ అట్మాస్ ఫెసిలిటీ, సౌండ్ డిజైన్ మరియు మిక్సింగ్‌లో అత్యున్నత స్థాయి శిక్షణకు వీలు కల్పిస్తుంది. దీని ద్వారా సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు మల్టీ డైమెన్షనల్ ఆడియో అనుభూతిని అందించే మెళకువలను అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో విద్యార్థులు నేర్చుకోనున్నారు. ఈ కొత్త సదుపాయం, తెలుగు సినిమా సాంకేతిక నిపుణులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో దోహదపడుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# అవసరాలే... అందంగా..!

**అయ్యో... ఉప్పెక్కడ పెట్టాను... దనియాలపొడి కనిపిచడం లేదు... మిరియాలపొడి ఏ డబ్బాలో పెట్టానో... బ్రేక్ ఫాస్ట్ కోసం ఓట్స్ తీస్తుంటే గిన్నెలో ఎక్కువ పడిపోయాయి... ఇవన్నీ రోజూ మన కిచెన్‌లో జరిగేవే కదా. చిన్న సమస్యలుగానే ఉన్నా కనిపించని సమయం వృథా అయ్యేది ఇక్కడే. వాటన్నింటికీ పరిష్కారంగా వచ్చినవే ఈ ఆర్గనైజర్లు.. వేటికవే ప్రత్యేకం, మనకీ ఉపయోగకరం...**







### * అతుక్కుంటాయి... స్థలాన్ని ఆదా చేస్తాయి...

వంటింటి వస్తువులను పెట్టుకోవడానికి వీలుగా కిచెన్‌లో ర్యాక్స్ లేనివాళ్లకి 'మాగ్నటిక్ స్పైస్ జార్స్' బాగా ఉపయోగపడతాయి. రిఫ్రిజిరేటర్‌కి అతికించుకునేందుకు వీలుగా జాడీల వెనక లేదా మూతలకి అయస్కాంతంతో తయారైన ఈ కంటైనర్లు ట్రాన్స్‌పరెంట్‌గా ఉండి లోపల ఉండే మసాలాలు సులువుగా కనిపిస్తాయి. స్టవ్ దగ్గరగా ఉండాలనుకుంటే మాగ్నటిక్ బోర్డును గోడకు ఫిట్ చేసుకుని జార్‌లను అతికించుకుంటే సరిపోతుంది. వివిధ రకాల ఆకారాల్లోనూ, సైజుల్లోనూ ఇవి దొరుకుతున్నాయి.

### డైనింగ్ టేబుల్ కొత్తగా...

డైనింగ్ టైబుల్‌పై ఉప్పు, మిరియాలపొడులు, కారప్పొడులు వేసుకునే డబ్బాలు మనం చూస్తూనే





ఉంటాం. ఆ డబ్బాలే కాస్త ఆకర్షణీయంగా కనిపిస్తే భలే అందంగా ఉంటాయి కదా. అయితే ఈ 'యానిమల్ హోల్డర్ విత్ సాల్ట్ అండ్ పెప్పర్ షేకర్ సెట్' మీ ఇంట్లో ఉండాల్సిందే. ఇవి ఆహారానికి రుచినే కాదు, ఇంటికి అందాన్నీ ఇస్తాయి. జిరాఫీ, ఏనుగులంటూ మనకు కావాల్సిన జతువుల రూపాల్లో దొరుకుతున్నాయి. పరిమాణంలో చిన్నగా ఉండటం వల్ల ఎక్కడికంటే అక్కడికి మార్చుకోవడమూ సులువే.

### డబ్బా కోసం వెతకక్కర్లేదు...

నెలకు సరిపడా సరకులు ఒకేసారి తెచ్చేసుకుంటాం. ఎక్కడివక్కడ సర్దేసుకుంటాం. ఆఫీసుకి వెళ్లే హడావుడిలో సరిపడినంత పప్పు, పిల్లలు రోజూ తినే ఓట్‌మీల్ వంటివి సమపరిమాణంలో కొలిచి తీసుకునే సమయం ఉండదు. దాంతో ఎక్కువ తక్కువలు అవుతుంటాయి. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చినవే ఈ 'గ్రిడ్ సెరెల్ ఫుడ్ డిస్పెన్సర్స్'. ఒక్కో కంటెయినర్ విడివిడిగా లేదా నాలుగైదు కలిపి గోడకు లేదా టేబుల్‌పై పెట్టుకునేలా వీటిని రూపొందించారు. వీటిల్లో పప్పు, ఓట్స్, స్నాక్స్ ఏవైనా నింపి దాని ముందు భాగంలో ఉన్న వాల్వ్ తిప్పితే రంధ్రం నుంచి పప్పు కిందికి వచ్చి కొలతకోసం ఇచ్చిన కప్పులో పడుతుంది. దాంతో ఎక్కువ తక్కువలు పడతాయనే భయమూ ఉండదు.

# పాటపాడే లాలీపాప్!



**'బాబూ ఇళయరాజా పాటపాడే ఒక లాలీపాప్ ఇవ్వు'... అని ఒక పెద్దాయన అంటే, 'అన్నా ఒక కె- పాప్ ట్రాక్ లాలీపాప్ ఇవ్వు' అన్నాడు మరో టీనేజీ కుర్రాడు... వినేవాళ్లకు ఇదంతా అయోమయంగానూ, ఆశ్చర్యంగానూ ఉంటుంది. అదీ నిజమే కదా... మ్యూజిక్ ట్రాక్స్‌కీ, తినే లాలీపాప్స్‌కీ ఏంటి సంబంధం అనిపిస్తుంది కానీ, మీరు వింటున్నది 100 శాతం నిజమే... ఇవి ఆడియో లాలీపాప్స్. మన చెవులకు మాత్రమే వీనుల విందైన సంగీతం అందిస్తాయివి. కావాలంటే మీరూ ఓ లాలీపాప్ తిని చూడండి...**

చెవుల్లో తీగలున్న ఇయర్‌ఫోన్స్, తీగలు లేని ఇయర్‌బడ్స్ లేకుండా దాదాపు యువత కనిపించదు. కానీ అవేమీ లేకుండా కూడా సంగీతాన్ని వినే అవకాశం కల్పిస్తున్నాయి ఆడియో లాలీపాప్స్. ఇయర్ ఫోన్లూ, మరే ఇతర స్పీకర్లూ లేకుండానే, కేవలం ఒక లాలీపాప్‌ని తింటూ, అద్భుతమైన సంగీతాన్నీ ఆస్వాదించవచ్చు. ఈ సంగీతం మనకు తప్ప వినాలనుకున్నా మరెవరికీ వినిపించదు. అవును, ఒక పక్క తియ్యని రుచి నోటికీ, మనసుకీ ఆనందం కలిగిస్తుంటే మరోపక్క మీకిష్టమైన సంగీతం ఆ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే సంగీత ప్రియులు పెద్దగా డబ్బులు ఖర్చుపెట్టకుండానే మినీ కాన్సర్ట్‌ని సోలోగా ఎంజాయ్ చేయొచ్చు... అది కూడా మీకు నచ్చిన పాటలతో. అదెలాగో చూద్దాం...





### బోన్ కండక్షన్ టెక్నాలజీతో...

ఎవరికీ వినిపించకుండా మనకు మాత్రమే సంగీతం వినిపిస్తుందా... ఇదేదో మ్యాజిక్‌లా ఉందే అనుకుంటున్నారా? అబ్బే అదేం కాదు, దీని వెనుక ఏ మాయాలేదు, మంత్రం లేదు, అబ్బురపరిచే టెక్నాలజీ మాత్రమే ఉంది. అదే... బోన్ కండక్షన్ టెక్నాలజీ. లాలీపాప్‌ని కొరికినా, నాలుకతో తాకినా దానిలో అప్పటికే ప్రీలోడ్ చేసిన పాటలు శబ్దతరంగాల నుంచి వైబ్రేషన్స్‌గా మారి దవడ ఎముక నుంచి చెవిలోపల ఉండే కాక్లియర్ భాగానికి చేరుకుంటాయి. సాధారణంగా మనం వినే శబ్దాలన్నీ బయట చెవి నుంచి కర్ణభేరికి చేరి అక్కడ నుంచి మెదడుకు వెళతాయి. కానీ ఈ విధానంలో బయట మనకు కనిపించే చెవితోకానీ, కర్ణభేరితో కానీ ఏమాత్రం పని ఉండదు. పంటి నుంచి కానీ, దవడ ఎముక నుంచి కానీ లాలిపాప్‌లో ఉన్న పాటలు నేరుగా లోపలి చెవికి చేరిపోతాయి. అందుకే మనకి మాత్రమే ఈ సంగీతం వినబడుతుంది. 'అమ్మో ఇదేదో కొత్త టెక్నాలజీ, చెవులకు ఇబ్బందేమీ కాదు కదా' అనుకుంటున్నారా? దీంతో చెవులకు ఏమాత్రం ఇబ్బంది లేదు, ఎందుకంటే ఈ టెక్నాలజీని ఇప్పటికే మనం చికిత్సల్లో వాడుతున్నాం కాబట్టి. వినికిడి సమస్యలున్నవారికి హియరింగ్ ఎయిడ్స్‌లో ఈ టెక్నాలజీని వాడే శబ్దాలు వినబడేటట్టు చేస్తున్నారు. అలాగే, క్రీడాకారులకూ, ఈతకొట్టేవారికీ సాధారణ హెడ్‌సెట్స్ సౌకర్యంగా ఉండవు, పరుగుపెట్టినప్పుడు పడిపోయే అవకాశాలెక్కువ... నీళ్లలో సరిగా వినిపించవు కాబట్టి అక్కడా వీటినే ఉపయోగిస్తారు. ఎమర్జెన్సీ సమయంలో సమాచారం చేరవేయడానికి మిలటరీ వాళ్లూ తమకు మాత్రమే అర్థమయ్యేలా ఈ బోన్‌కండక్షన్ టెక్నాలజీనే వాడి సందేశాలు వింటూ ఉంటారు. ఈ టెక్నాలజీని వాడే ఆడియోలాలీపాప్స్‌నీ తయారుచేస్తున్నారు.

### ఏ పాట కావాలన్నా...

ఈ లాలీపాప్స్‌తో ఏవో కొన్ని పాటలు కాదు, మనకు బాగా నచ్చిన ఏ పాటనైనా ఆస్వాదించవచ్చు. లవోలీ, లాలీట్యూన్, లాలీపాప్‌స్టార్, అమోస్‌టేస్టీ సౌండ్స్ లాంటి సంస్థలు అటు లాలీపాప్స్‌ని స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, కోలా వంటి రుచుల్లో అందిస్తూనే, కుర్రకారు ఇష్టపడే కె పాప్ ట్రాక్స్‌తోపాటు హాలీవుడ్‌లోని అనేక పాపులర్ పాటలని ప్రీలోడ్ చేసి ఇస్తున్నాయి. అవికాదు, మా అభిమాన గాయకుడూ, సంగీత దర్శకుడూ వేరే ఉన్నారు అనుకుంటే వాళ్లపాటలనీ కస్టమైజ్ చేసి అందించే సౌకర్యాన్ని కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. కొందరైతే పుట్టినరోజు కానుకగా ఇవ్వడానికి ప్రత్యేకంగా హ్యాపీబర్త్‌డే సాంగ్స్‌ని పొందుపరిచి ఈ లాలీ పాప్స్‌ని చేయించుకుంటున్నారు. వీటితో ఆరు నిమిషాలనుంచి గంటవరకూ సంగీతాన్ని వినొచ్చు. కొన్నిసంస్థలు పాడ్‌కాస్టింగ్ వినే సదుపాయం కూడా కల్పిస్తున్నాయి. ఆ సంగతి సరే, సంగీతం కోసం తీపి తిని మా ఆరోగ్యం పాడుచేసుకుంటామా అనుకునే వారికోసం... షుగర్ ఫ్రీ లాలీపాప్స్‌ని కూడా ప్రత్యేకంగా తయారుచేస్తున్నారు. అదన్నమాట విషయం, మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక లాలీపాప్‌ని మీరూ చప్పరించేయండి. సంగీత ఝరిలో మునిగితేలండి.



## విటమిన్ ఎ ఎందుకంటే..

**విటమిన్ ఎ అనేది కొవ్వులో కరిగే (ఫ్యాట్-సాల్యబుల్) విటమిన్. ఇది మన శరీరానికి చాలా ముఖ్యమైన పోషకం. మహిళల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చర్మ సంరక్షణని పట్టించుకునే యువతులు... అందరికీ ఇది అత్యవసరం. ఎందుకో తెలుసుకుందామా?**

విటమిన్ ఎ రాత్రిపూట స్పష్టంగా చూడటానికి సహాయపడుతుంది. ఇది రెటినాలోని రోడొప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి అవసరం. దీని లోపం ఉంటే రేచీకటి వస్తుంది.

చర్మ కణాల పునరుత్పత్తికి సహాయపడుతుంది. మొటిమలు, పొడి చర్మం సమస్యలను తగ్గిస్తుంది. అందుకే దీన్ని రెటినాయిడ్ క్రీమ్‌లు, చర్మ సౌందర్య చికిత్సల్లోనూ వాడతారు.

విటమిన్ ఎ తెల్ల రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. ఫలితంగా రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. మీజిల్స్ వంటి వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.

శిశువు అవయవాలు (ముఖ్యంగా కళ్లు, ఊపిరితిత్తులు, గుండె) సరిగ్గా ఎదగడానికి విటమిన్ ఎ సహాయపడుతుంది. గర్భిణుల్లో రోగ నిరోధకతను పెంచుతుంది. అంతేకాదు... పాలిచ్చే తల్లులకు ఈ పోషకం రోజువారీ అవసరం మరింత ఎక్కువ. ఎందుకంటే... శిశువుకు తల్లిపాల ద్వారానే విటమిన్ ఎ అందుతుంది. అంతేకాదు...ఇది బీటా కెరొటిన్ రూపంలో క్యాన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

**విటమిన్ ఎ సాధారణంగా రెండు రూపాల్లో లభిస్తుంది:**

1. రెటినాల్: దీన్ని శరీరం నేరుగా ఉపయోగించుకుంటుంది. లివర్, ఫిష్ ఆయిల్, గుడ్లు (పచ్చసొన), పాలు, పెరుగు, వెన్న, చీజ్ వంటివాటి నుంచి ఇది లభిస్తుంది.
2. బీటాకెరొటిన్: ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. ఇది నారింజ, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలు/పండ్లు) అయిన క్యారెట్, బత్తాయి, పాలకూర, ఆకుకూరలు, మామిడి పండు, బొప్పాయి, బ్రాకలీ, క్యాప్సికం వంటివాటి నుంచి అందుతుంది.

# సరూర్ నగర్ అభివృద్ధికి సరికొత్త బాట: మినీ ట్యాంక్ బండ్ వద్ద సందడి

* 1000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భారీ బందోబస్తు.
* పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి రక్షణ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు.
* అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కఠిన పర్యవేక్షణ.
* ప్రశాంత ఎన్నికల కోసం రాత్రింబవళ్లు విధుల్లో పోలీసులు.
* నేర ప్రవృత్తులకు అవకాశం ఇవ్వం - 432 మందిపై సత్ప్రవర్తన బైండోవర్.

*** సునిత రెడ్డి ఐపీఎస్..**

వనపర్తి జిల్లా, ఫిబ్రవరి 10 (భారత శక్తి) : వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అత్యంత పటిష్టమైన భద్రత ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్.తెలిపారు. అదనపు ఎస్పీ, డిస్పీలు ప్రత్యేక పోలీసు బృందాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛయుత ఓటు హక్కును సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలు



ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుంది ఆమె అన్నారు. 5 మున్సిపాలిటీలలో 80 వార్డులకు గానూ 191కేంద్రాలు, జరుగనున్నాయని అన్నారు. ఇందులో 67సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ గుర్తించి ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల భద్రత అనేది సమష్టి బాధ్యతని విధుల్లో ఉన్న సిబ్బంది ప్రతి నిమిషం జిల్లావ్యాప్తంగా పోలీసుల కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పూర్తి రక్షణతో పాటు 163 BNSS (144 సెక్షన్) ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.పోలింగ్ రోజు ఎన్నికల సరళి కై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా బృందాలు, మొబైల్ పెట్రోలింగ్, చెక్‌పోస్టులు నిరంతరం పనిచేస్తున్నాయి, శాంతియుత ఎన్నికలు భద్రమైన ప్రజాస్వామ్యం లక్ష్యంగా పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలి అన్నారు అంతేకానీ ఉచితాలు, బహుమతులు, డబ్బు మద్యం లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచెయొద్దని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినా, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, 123 కేసులు నమోదు చేసి, 432 మందిని సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం అక్రమ రావాణాపై జిల్లాలో విలువైన 425 లీటర్ల మద్యం సీజ్ చేశాం అన్నారు.



## మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించిన పణ్యాల జయపాల్ రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (TSRDC) ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కులు తీర్చుకున్నారు.

*** సేవా కార్యక్రమాలతో చాటుకున్న ఉదారత**

రాంరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తున్నారని



కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

*** పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ వేడుకల్లో చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గణేష్ నాయక్, దేవస్థానం ధర్మకర్తలు తోక కిరణ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, నాయకులు దిండు ప్రవీణ్ గౌడ్, భానుచందర్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఖాతాదారుల సేవ, సౌకర్యం మా బ్యాంక్ మొదటి ప్రాధాన్యం

**: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సి జి ఎం ఎస్ గోపాల్..**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి ప్రత్యేక ప్రతినిధి): మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో నూతనంగా ఆధునీకరించబడిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మెనేజర్ ఎస్ గోపాల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ఎల్లప్పుడూ ఖాతాదారుల సేవలో నిమగ్నమయి వుంటుందని తెలిపారు. తమ బ్యాంకు 9 వసంతాలు పూర్తి చెసుకున్నది అంటే అది కేవలం మా ఖాతాదారులు తమపై వుంచిన నమ్మకం, వారి ప్రేమ ఆదరణ వలనే అని చెప్పారు. మారుతున్న డిజిటల్ కాలానికి అనుగుణంగా తమ బ్యాంకు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ కొత్త ఖాతాదారులను ఆకర్షిస్తున్నట్లు గోపాల్ తెలిపారు.



తదుపరి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ కార్యక్రమంలో ఐఓబీ డీ జీ ఎం శివరామకృష్ణ, చీఫ్ మేనేజర్ శ్రీదేవి, బ్రాంచ్ మేనేజర్ అమీరున్నీసా బేగం, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. తదుపరి ఉచిత కంటి పరీక్ష, దంత పరీక్షా సేవలను ఎస్ గోపాల్ ప్రారంభించారు.

## ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని రాయలసీమ ఎకానమీ పవర్ హబ్ అభివృద్ధి చేస్తాం

*** జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10(భారత శక్తి) : వాణిజ్య పరంగా అత్యంత ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని రాయలసీమలో ఒక ప్రత్యేక ఎకానమీ పవర్ హబ్ అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్యపరంగా పేరున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, అధునాతన, సాంకేతిక పద్ధతితో భూగర్భ డ్రెయినేజీని చేపడుతామన్నారు. అందుకోసం పట్టణములోని అన్ని ప్రధాన డ్రైనేజీ కాలువలు ఆనుకుని ఉన్న నివాసాలు, ఆక్రమ కట్టడాలను తొలగించి, కాలువలను విస్తరించేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి నుండి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించి ఉన్న మదూరు కాలువ సమస్యను కూడా శాస్వితంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేకమైన పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అవసరమైతే అదనంగా పారిశుద్ధ్య కార్మికులను కూడా నియమించుకొనే చర్యలను చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి.. ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉందన్న పారిశుధ్య సమస్యకు సంపూర్తిగా పరిష్కారం చూపాలన్నారు. స్వచ్ఛఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాధనలో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వంద శాతం స్వచ్ఛతను సాధించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టి పురోగతిలో ఉన్న వాటిని మార్చి 15 లోపు పూర్తి చేయాలన్నారు. ఇంకా మొదలు పెట్టాల్సిన పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయగలిగితేనే మొదలు పెట్టాలన్నారు. త్వరితగతిన చేయగలిగిన గోకులం షెడ్స్, సిసి రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూ ఎం రోడ్లు, కాంపౌండ్ వాల్ మొదలైన పనులను ఎంపిక చేసుకుని 100% పూర్తి చేసేలా మొదలు పెట్టాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పుష్కలమైన సాగునీటి సదుపాయాలు ఉండడంతో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం అధికంగానే సాగుతొందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలతో పాటు పశుసంపదను, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం డిఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రసాయనాలు లేని, ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయాన్ని



ప్రత్యేకంగా ప్రేరేపిస్తోందన్నారు. ఆ దిశగా జిల్లాలో 38 వేల ఎకరాలలో సహజ పద్ధతిలో వ్యవసాయం ద్వారా 48 వేల మంది రైతులు ముఖ్యంగా మహిళలు ఆరోగ్యకరమైన పంటలను పండిస్తున్నారన్నారు. సుస్థిర మార్కెటింగ్ అభివృద్ధికో ఫ్రీ ట్రస్ట్ మార్కెటింగ్ విధానం ద్వారా స్వేచ్ఛా పారదర్శక విక్రయాలు చేపట్టడం జరుగుతుంది. అత్యధిక మార్కెటింగ్ నిర్వహణ సౌలభ్యం ఉన్న ప్రొద్దుటూరులో ఫ్రీ ట్రస్ట్ మార్కెట్ ను త్వరలో నిర్వహణలోకి తీసుకురావడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను విస్తారంగా పండించి రైతులకు సుస్థిర ఆదాయ వనరులనుంసమకూర్చే లక్ష్యంతో ఉద్యాన శాఖ, డ్వామా, మైక్రోఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో సంప్రదాయ వ్యవసాయ పంటలు కాకుండా భవిష్యత్తులో దీర్ఘకాలిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలను పండించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉద్యాన పంటలు సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం ఏ మేర సబ్సిడీ పథకాలను అమలులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇలాంటి అవకాశాలతో రైతులు అపదాయకంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ద్వారా చుట్టు పక్కల ప్రాంతాల గ్రామాలకు వైద్యసేవలు అందుతున్నాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలో అధునాతన భవన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని.. ప్రతిరోజు వందలాది మంది ఓపిలు నమోదు కావడంతో పాటు, దీర్ఘ కాలిక వ్యాధులకు చికిత్సలు, ఐపి బ్లాకులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు ప్రణాళికల రూపొందించాలన్నారు. ముందుగా ఎనిక్రోచ్మెంట్ కు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఒక్క నెలలోపు పూర్తి చేయలన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో అభివృద్ధి తోపాటు ఆదాయాన్ని కూడా పెంచే మార్గాలను పెంచాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని నివాస ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ప్రతి కట్టడానికి బిల్డింగ్ పర్మిషన్ తీసుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేస్తూ ప్రజలను మధ్యవర్తుల వద్దకు వెళ్లకుండా మున్సిపల్ అధికారులే ప్రత్యేక మేళా ద్వారా ప్రతి ఒక్కరూ టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణములోని అన్ని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో సిసి కెమెరాల నిఘాను పటిష్టం చేయాలన్నారు. దక్షిణ భారత దేశంలోనే బులియన్ మార్కెట్ కు ప్రాముఖ్యత ఉన్న ప్రొద్దుటూరు పట్టణం రాష్ట్రానికి ప్రధాన మార్కెటింగ్ ఆదాయ వనరుగా కొనసాగుతోందన్నారు. అంతటి వాణిజ్య ప్రాముఖ్యం ఉన్న ప్రొద్దుటూరులో లా అండ్ ఆర్డర్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రధానంగా ప్రొద్దుటూరు పట్టణంలో గ్యాంబ్లింగ్, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను, గంజాయి అమ్మకాలను సమూలంగా తుడిచి పెట్టేందుకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం పారదర్శకంగా, నిక్కచ్చిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రయివేటు, ప్రభుత్వ ప్రాపర్టీకి సంబంధించిన పెండింగ్ లోఉన్న పన్నుల వసూళ్లపై ఆదేశాలు ఇవ్వడం జరిగింది. బులియన్ మార్కెట్ లో పెరిన్నికగన్న ప్రొద్దుటూరు పట్టణంలో బంగారు నగల తయారీ పరిశ్రమ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్దం అవుతాయన్నారు. హౌసింగ్, ప్రయివేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో వచ్చిన పలు అభ్యంతరాలపై విచారణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఐడిఎంఎస్ పద్ధతి ద్వారా చేపట్టిన పట్టణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఎక్కడ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, భవన నిర్మాణాలకు సంబంధించి.. ఎక్కరైనా ఫారెస్ట్ క్లియరెన్స్, ఫారెస్ట్ ల్యాండ్ లో చేపట్టిన సామాజిక కట్టడాలు, వాటిపై వస్తున్న అభ్యంతరాలు, ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ.. విలువలతో కూడిన నాయకత్వం, పారదర్శకతతో కూడిన విధి నిర్వహణ అధికారులను కానీ, నాయకులను కానీ అత్యున్నత స్థాయికి తీసుకువెళుతాయని తెలిపారు. అనంతరం డ్వామా, డిఆర్డీఏ, మెడికల్, ఐసిడిఎస్, విద్యాశాఖ, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్ శాఖ, పరిశుధ్యం, రవాణా, ట్రాఫిక్, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలపై... సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, స్థానిక నాయకులు, పట్టణాధ్యక్షులు, అడ్వకేట్ సుధాకర్ రెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, అన్నిశాఖల జిల్లాస్థాయి, డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 304 వాహనాలు ఆన్‌లైన్ వేలానికి సిద్ధం

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 10: సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మోయినాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణం, బౌరంపేట్ లోని వివిధ కంపెనీల మోడళ్ల కు చెందిన మొత్తం 304 వదిలివేసిన వాహనాలను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు ప్రతిపాదించినట్లు సైబరాబాద్ ఎంటీఓ II ఎన్. వీరలింగం వెల్లడించారు. సైబరాబాద్ (మెట్రోపాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్-2004 సెక్షన్ 6(2), 7తో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్లు 39, 40, 41 ప్రకారం ఈ వాహనాలను వేలం వేయడానికి అధికారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాహనాలపై యాజమాన్య హక్కు లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నవారు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి ఆరు నెలల లోపు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసి తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా ఎవరూ దావా చేయనట్లయితే, యజమాని లేని వాహనాలను పబ్లిక్ ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయిస్తామని స్పష్టం చేశారు. మోయినాబాద్ స్టేషన్‌లో ఉన్న వాహనాల వివరాలు ఎన్. వీరలింగం, ఎమ్‌టీఓ-II, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సెల్: 8712663357) పర్యవేక్షణలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలు సైబరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పొందవచ్చని పేర్కొన్నారు.

# సీఎం సొంత జిల్లాలోనే నీటి కష్టాలు.. గుంటనక్కకు, రేవంత్‌కి మధ్య ఉన్న సంబంధం ఏంటి?

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోనే నీటి కష్టాలు ఉన్నాయి. రెండు, మూడు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి. 30 ఏళ్ల కింద ఉన్న సిటీ బస్సులు ఇప్పుడు లేవు.. అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణలో రాబోయే మున్సిపల్ ఎన్నికలు, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం సిద్దిపేట మున్సిపాలిటీకి మాత్రమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిధులు మంజూరు చేయడంపై కవిత అనుమానం వ్యక్తం చేశారు.

*** సిద్ధిపేటకే ఎందుకు?**

"కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నా పనులు మాత్రం వారికే (సిద్ధిపేట) అవుతాయి. ఇది చాలా వెరైటీగా ఉంది. ముఖ్యమంత్రికి, అక్కడి ఎమ్మెల్యేకు (గుంటనక్క అని సంబోధిస్తూ) ఉన్న సంబంధం ఏంటో, దీని వెనుక ఆంతర్యం ఏంటో ప్రజలకు తెలియాలి," అంటూ కవిత డిమాండ్ చేశారు. ఎన్నికలు లేని సిద్ధిపేటకు నిధులు ఇచ్చి, ఎన్నికలు జరగాల్సిన మిగతా మున్సిపాలిటీలను విస్మరించడం దారుణమని మండిపడ్డారు.

*** మున్సిపాలిటీల దుస్థితి**

సీఎం సొంత జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పాఠశాలలు కేవలం ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపించే సెంటర్లుగా మారాయి. బస్తీ దవాఖానాల్లో మందులు, డాక్టర్లు లేరు. ప్రతి మున్సిపాలిటీలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. సీఎం సొంత నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లులో నడిరోడ్డుపై చెత్త ఉన్నా పట్టించుకునే నాధుడే లేడు.. అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** బడ్జెట్ డిమాండ్లు - కాంగ్రెస్ హామీలు**

ఫిబ్రవరి 26 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలపై జాగృతి పలు డిమాండ్లు చేసింది. ఈ బడ్జెట్ కాంగ్రెస్ హామీలను నిలబెట్టుకునేదిగా ఉండాలని స్పష్టం చేసింది. రైతులకు, కౌలు రైతులకు కలిపి రూ.25,000 కోట్లు, రైతు కూలీలకు రూ.10,000 కోట్లు కేటాయించాలి. రుణమాఫీ 100 శాతం పూర్తి చేయాలి. ఇప్పటికీ 50 శాతం మందికి రుణమాఫీ కాలేదని, దీనిపై చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా రూ. 25,000 కోట్లు కేటాయించాలి. బకాయి ఉన్న రూ.11,000 కోట్లను వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద విడుదల చేయాలి. వృద్ధులు, వితంతువుల పెన్షన్ల కోసం రూ.35,000 కోట్లు కేటాయించాలి. అమరవీరుల కుటుంబాలకు రూ.25,000 పెన్షన్ హామీని నెరవేర్చాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలి. ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లను కాకుండా ఆర్టీసీ సిబ్బందినే నియమించాలి. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు రూ.20,000 కోట్లు బడ్జెట్‌లో పెట్టాలి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా, స్థానిక సమస్యలపై పోరాడే మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని పట్టణ ప్రజలకు, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులకు జాగృతి విజ్ఞప్తి చేసింది.

# వరల్డ్ బ్యాంక్ ర్యాంకింగ్స్ లో భారత్ పైపైకి!

ఢిల్లీ, ఫిబ్రవరి 10 (భారతశక్తి ): వ్యాపార సౌలభ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో గత ఐదేళ్లలో భారత్ ఏకంగా 79 ర్యాంకులు మెరుగుపరుచుకుంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ గతంలో ప్రచురించిన ర్యాంకింగ్స్‌లో ఈ పురోగతి నమోదైందని ఆయన తెలిపారు. వరల్డ్ బ్యాంక్ 2020లో 'డూయింగ్ బిజినెస్ రిపోర్ట్' (DBR)ను నిలిపివేసిందని, దాని స్థానంలో 2024లో 'బీరెడీ' పేరుతో కొత్త అసెస్‌మెంట్‌ను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. 180 దేశాల్లో వ్యాపార జీవితచక్రంలోని 10 అంశాల ప్రాతిపదికన ఈ అంచనా ఉంటుందని చెప్పారు. 2026లో విడుదల కానున్న మూడో బీరెడీ నివేదికలో భారత్‌ను కూడా చేర్చనున్నట్టు ఆయన వివరించారు. దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (DPIIT) పలు చర్యలు చేపట్టిందని జితిన్ ప్రసాద అన్నారు. ఇందులో భాగంగా 2014లో 'వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక' (BRAP)ను ప్రారంభించినట్టు తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థలు, భవన నిర్మాణ అనుమతుల సరళీకరణ, డిజిటల్ సేవలు వంటివి ఇందులో భాగమని పేర్కొన్నారు. ఈ ప్రణాళిక కింద ఇప్పటివరకు ఏడుసార్లు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేసినట్టు మంత్రి వివరించారు. దీని ద్వారా రాష్ట్రాల స్థాయిలో 9,700కు పైగా సంస్కరణలు అమలయ్యాయని తెలిపారు. అంతేకాకుండా, 2020లో ప్రారంభించిన 'నిబంధనల భారం తగ్గింపు' (R.C.B) కార్యక్రమం కింద వ్యాపారాలు, పౌరులపై భారం మోపుతున్న 47,000కు పైగా నిబంధనలను గత ఐదేళ్లలో తగ్గించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

# ఏపీకి మరో వందేభారత్... కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 10 (భారతశక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయవాడబెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వెళ్లేలా వందేభారత్ రైలును కేటాయించాలని కోరారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, చెన్నైబెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏపీని తాకుతూ ప్రకటించడంపై చంద్రబాబు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో, బెంగళూరుచెన్నై హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా కోరారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రారంభించేలా తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే సరకు రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్‌పీటీ పోర్టుకు అరటిపండ్ల ఎగుమతికి వీలుగా, 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లను కేటాయించాలని కోరారు. అలాగే ఉత్తరదక్షిణ భారతాలను కలిపే ఇటార్సీ విజయవాడ ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌కు, ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్‌చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని ప్రతిపాదించారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని పెంచేందుకు కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. హైదరాబాద్‌శ్రీశైలంమార్కాపురం మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినల్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడబెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ సర్వీసును నడపాలని చంద్రబాబు కోరారు. విశాఖవిజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడకర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతిచిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుప్పంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతో పాటు, అక్కడ రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని కూడా రైల్వే మంత్రిని కోరారు. సీఎం వినతులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

**ఢిల్లీలో చంద్రబాబు ఫుల్ బిజీ!**

సీఎం చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ ఆయన తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో వేర్వేరుగా భేటీ అయ్యారు. మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన చంద్రబాబు, రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిని ఆయనకు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాల నిర్వహణకు (వేస్ట్ మేనేజ్‌మెంట్) ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని 'జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్'గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద రూ. 276 కోట్ల అంచనా వ్యయంతో ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 105 కోట్లను వెంటనే మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్) తిరిగి లాభాల బాట పట్టడంపై కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక చేయూత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు, అలాగే స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల అవిరళ కృషితోనే ఇది సాధ్యమైందని కుమారస్వామికి వివరించారు. ప్రస్తుతం వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడమే కాకుండా, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌ఐఎన్‌ఎల్ విషయంలో భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం ఇదే రకమైన తోడ్పాటును, సహకారాన్ని కొనసాగించాలని కోరారు. ఈ భేటీల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, సహకారాన్ని సాధించేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# 'ఏఐ' కంటెంట్ దుర్వినియోగంపై
## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు

ఢిల్లీ, ఫిబ్రవరి 10 (భారతశక్తి ప్రతినిధి): కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా రూపొందించే కంటెంట్‌ను గుర్తించడానికి, నియంత్రించడానికి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. చట్టవిరుద్ధమైన, అసభ్యకరమైన, తప్పుదారి పట్టించే విషయాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలను అందుబాటులోకి తేవాలని సూచించింది. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కంటెంట్ కొత్త సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌కు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా లేబుల్ వేయాలని ఆదేశించింది. కంటెంట్‌ను అందరు సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని స్పష్టం చేసింది. ఒకసారి దీనిని అప్లై చేశాక లేబుల్‌ను గానీ మెటా డేటాను గానీ తొలగించడానికి లేదా కనబడకుండా చేయడానికి వీలులేకుండా ఉండాలని పేర్కొంది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు, శిక్షల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి యూజర్‌కు సందేశాలు పంపించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఏఐ జనరేటెడ్ లేదా డీప్ ఫేక్ కంటెంటును తొలగించాలని ప్రభుత్వం లేదా కోర్టులు ఆదేశించినప్పుడు దానిని మూడు గంటల్లోనే తొలగించాలని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ
## ఫోన్ ట్యాపింగ్.. బాంబు పేల్చిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి): రాష్ట్ర రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరిన్ని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ అంశంపై తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే కాకుండా, ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని ఆయన బాంబు పేల్చారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని స్పష్టం చేశారు.

*** పరికరాల కోసం వేట.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు**

"ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఇంకా జరుగుతోందని చాలా మంది గగ్గోలు పెడుతున్నారు. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. అసలు ఈ ట్యాపింగ్ వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అక్రమంగా ట్యాపింగ్ చేసే ఎక్విప్‌మెంట్ (పరికరాలు) ఎక్కడెక్కడ అమర్చారు? అనే విషయాలపై ప్రభుత్వం ఇప్పటికే లోతుగా ఆరా తీస్తోంది. విచారణ జరిపి బాధ్యులు ఎవరైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు," అని పొంగులేటి హెచ్చరించారు.

***మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం**

రాష్ట్రంలో బుధవారం జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకున్నాం. అందుకే ప్రజలు మా వెంటే ఉన్నారు. ఈ పుర పోరులో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం. ప్రతిపక్షాల ఆక్రోశం వారి ఓటమి భయానికి నిదర్శనం. జూబ్లీహిల్స్ ఫలితాలే రేపు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం కాబోతున్నాయి," అని స్పష్టం చేశారు.

**దొరల పాలనలో అప్పుల కుప్ప**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ.8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని ఆరోపించారు. "మేము నెలకు రూ.6,300 కోట్లు కేవలం వడ్డీలకే కడుతున్నాం. అయినా సంక్షేమాన్ని ఆపలేదు. గతంలో 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేము 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం." అని మంత్రి వివరించారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పులేదని, తన పార్టీ గెలుపు కోసం తాను ప్రచారం చేశానని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు.

## అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను..
# స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!

ఢిల్లీ, ఫిబ్రవరి 10 (భారతశక్తి ప్రతినిధి): లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(c) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు. ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసం ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు...
# బయటకు పరుగుతీసిన ప్రజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారతశక్తి): హైదరాబాద్ శివారులో స్వల్పంగా భూప్రకంపనలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారంలోని మెట్‌ఖాన్‌గూడ ప్రాంతంలో ఉదయం 10:10 గంటలకు భూమి కంపించినట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగు తీశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రకంపనలు రావడంతో వారు ఒక్కసారిగా భయపడి బయటకు వచ్చారు. అయితే ఇది భూమి కంపించడం వల్ల జరిగిందా? లేక చుట్టుపక్కల పేలుడుతో వచ్చిన ప్రకంపనలా అనేది తెలియాల్సి ఉంది. గేటెడ్ కమ్యూనిటీల్లోని సీసీ కెమెరాల్లో భూమి కంపించినట్లు కనిపించింది. స్థానికంగా ఉన్న పాఠశాలకు స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించింది. స్థానికులు మాట్లాడుతూ, భూమి హఠాత్తుగా కంపించినట్లయిందని, ఏం జరిగిందో తెలియక అందరం బయటకు వచ్చామని చెప్పారు. భారీ శబ్దం వచ్చి భూమి కంపించినట్లు అనిపించిందని అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రెవెన్యూ, సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

## వాయుసేనకు 114 కొత్త రఫేల్స్...
# రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

ఢిల్లీ, ఫిబ్రవరి 10 (భారతశక్తి): భారత వాయుసేన (IAF) అమ్ములపొదిని మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ వారంలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్దది కానుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం విమానాల కొనుగోలుకే పరిమితం కాదు. ఇందులో భాగంగా దాదాపు 100 యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ డీల్ ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత రఫేల్ యుద్ధ విమానాలను అత్యధిక సంఖ్యలో వినియోగిస్తున్న దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తుంది. భారత్ వద్ద ఇప్పటికే 36 రఫేల్ 'C' వేరియంట్ ఫైటర్ జెట్లు ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో చివరి విమానం వాయుసేనకు అందింది. ఈ జెట్లను అంబాలాలోని 'గోల్డెన్ యారోస్' (నెం.17 స్క్వాడ్రన్), బెంగాల్‌లోని హసిమారాలో ఉన్న 'ఫాల్కన్స్' (నెం.101 స్క్వాడ్రన్)లలో మోహరించారు. వీటితో పాటు రూ.63,000 కోట్లతో 26 నేవల్ వేరియంట్ (రఫేల్ M) జెట్ల కొనుగోలుకు కూడా భారత్ ఆర్డర్ ఇచ్చింది. ఈ నేవల్ వేరియంట్ జెట్లను ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య విమాన వాహక నౌకలపై మోహరిస్తారు.

# రూ. 1,511 కోట్ల విలువైన భూములను రక్షించిన హైడ్రా..

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (భారత శక్తి) : నగరంలోని విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కు స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు 'హైడ్రా' (HYDRAA) తన దూకుడును కొనసాగిస్తోంది. మంగళవారం ఒకే రోజు నగరం నలువైపులా నాలుగు ప్రధాన ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించిన అధికారులు.. సుమారు రూ. 1,511 కోట్ల విలువైన ఆక్రమణలను తొలగించారు. స్వాధీనం చేసుకున్న భూములకు తక్షణమే రక్షణ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను అమర్చారు.




*** కొండాపూర్‌లో రూ. 700 కోట్ల భూమి స్వాధీనం**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మదీనాగూడ రోడ్డులో ఉన్న 'జంగం కుంట'ను కబ్జాదారుల నుంచి అధికారులు విముక్తి చేశారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువును మట్టితో పూడ్చివేసి, ప్లాట్లుగా విక్రయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించిన సంయుక్త తనిఖీల్లో ఇది చెరువు భూమిగా నిర్ధారణ కావడంతో, కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేశారు. ఈ భూమి విలువ సుమారు రూ. 700 కోట్లు ఉంటుందని అంచనా.

*** అల్వాల్‌లో ప్లాస్టిక్ యూనిట్లపై వేటు**

అల్వాల్ మండలంలోని 'కొత్త చెరువు' ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న కార్యకలాపాలపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ఎనిమిది ఎకరాల మేర విస్తరించిన ఆక్రమణలను తొలగించింది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, వ్యర్థాల సేకరణ కేంద్రం వల్ల చెరువు కలుషితమవుతోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అక్కడ నిర్మించిన తాత్కాలిక షెడ్లను కూల్చివేసి చెరువు పరివాహక ప్రాంతాన్ని పునరుద్ధరించారు.



*** ప్రజావాణి ఫిర్యాదులతో పార్కులకు విముక్తి**

జనవాసాల మధ్య ఉన్న పార్కు స్థలాల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా తక్షణమే స్పందించింది.

**జక్కిడి కాలనీ:** వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడి నగర్ కాలనీలో 1982లో కేటాయించిన 650 గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడ, రెండు షెడ్లను అధికారులు కూల్చివేశారు. లేఅవుట్ నిర్వాహకులే ఈ స్థలాన్ని తిరిగి అక్రమంగా విక్రయించడాన్ని గుర్తించిన అధికారులు.. దానిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు.

**రాధాకృష్ణ నగర్:** మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్ రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కు స్థలాన్ని కాపాడారు. గతంలో జీహెచ్‌ఎంసీకి గిఫ్ట్ డీడ్ ద్వారా లభించిన ఈ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను మంగళవారం తొలగించారు. చెరువులు, కుంటలు, పార్కు స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, ప్రజలు కూడా ఇటువంటి అక్రమాలపై ఫిర్యాదు చేయాలని హైడ్రా అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



### ఎల్బీనగర్ ప్రగతి పథంలో..

# రూ. 45 కోట్లతో పనుల జోరు

- **ఎన్నికల కోసమే కాదు..**
- **జవాబుదారీతనంతోనే అభివృద్ధి: మంత్రి శ్రీధర్ బాబు**
- **వడ్డీల భారం ఉన్నా ఆగని సంక్షేమం**
- **రెండేళ్లలో రూ. 760 కోట్లతో అభివృద్ధి: మధుయాష్కీ గౌడ్**

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 (భారత శక్తి): ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ జవాబుదారీతనంతోనే పని చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మంగళవారం ఆయన సుమారు రూ. 45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, బొగ్గారపు దయానంద్‌లతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**సంక్షేమమే మా అజెండా:**

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వ పాపాల వల్ల రాష్ట్రంపై పెను ఆర్థిక భారం పడిందని మండిపడ్డారు. "గత ప్రభుత్వ అప్పుల కారణంగా నెలకు రూ. 6,700 కోట్లు కేవలం వడ్డీలకే కడుతున్నాం. ఆ నిధులు అందుబాటులో ఉంటే ప్రజలకు మరింత మేలు జరిగేది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, తమ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తూ, సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగిస్తోందని గుర్తు చేశారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా వనస్థలిపురంలో మినీ ఆడిటోరియం నిర్మిస్తామని, ఐదు కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లకు



నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు.

**అభివృద్ధిలో కొత్త రికార్డు:**

మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాలకు కేవలం రూ. 400 కోట్లు వెచ్చిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే రూ. 760 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గణాంకాలతో వివరించారు. స్థానిక ఎమ్మెల్యే తీరును విమర్శిస్తూ.. రాజకీయం అంటే రౌడీయిజం కాదని, ప్రజల సేవ అని హితవు పలికారు. కార్యకర్తల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**ముఖ్య విశేషాలు:**

మౌలిక సదుపాయాలు: ట్రాఫిక్ చిక్కులు వీడేలా ఫ్లైఓవర్లు, వంతెనల నిర్మాణం.

**వరద ముప్పు నివారణ:**

ప్రాధాన్యత క్రమంలో నాలాల విస్తరణ పనులు.

ఇందిరమ్మ రాజ్యం: సొంతింటి కల నెరవేర్చేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బానోతు సుజాత నాయక్ సహా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరూర్ నగర్ అభివృద్ధికి సరికొత్త బాట: మినీ ట్యాంక్ బండ్ వద్ద సందడి

సరూర్ నగర్, ఫిబ్రవరి 10 (భారత శక్తి) : చారిత్రక సరూర్ నగర్ మినీ ట్యాంక్ బండ్ పరిసరాలు సరికొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలను తీరుస్తూ, పర్యాటక శోభను పెంచే లక్ష్యంతో తలపెట్టిన నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం వైభవంగా శంకుస్థాపన చేశారు.

*** ఘన స్వాగతం.. ఆధ్యాత్మిక సత్కారం**

శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి స్థానిక నేతలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఖిల్లా మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ కందికంటి శ్రీధర్ గౌడ్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రితో చర్చించిన అనంతరం, వారు ఆయనకు 'శివ స్వరూప' విగ్రహాన్ని బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

**అభివృద్ధి వైపు అడుగులు:**

సరూర్ నగర్ చెరువు పరిసరాల్లో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఈ బ్రిడ్జి నిర్మాణం అత్యంత కీలకం కానుంది.

- రవాణా సౌలభ్యం: ఈ నూతన వంతెన అందుబాటులోకి వస్తే చైతన్యపురి సరూర్ నగర్ మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది.



- పర్యాటక ప్రాధాన్యత: మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభించనుంది.
- రాజకీయ ప్రాముఖ్యత: నగరం లోని కీలకమైన ఎల్బీ నగర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందనే సంకేతాన్ని ఈ పర్యటన పంపింది.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బ్రిడ్జి నిర్మాణానికి ఐటీ మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 (భారత శక్తి): మహేశ్వరం, ఎల్బీనగర్ నియోజకవర్గాల ప్రజలకు చాలా సంవత్సరాలుగా పరిష్కారం కాని సరూర్‌నగర్ చెరువు కట్ట మీద బ్రిడ్జి నిర్మాణం, ట్రాఫిక్ సమస్యలకు నేడు పరిష్కారం దిశగా ముందడుగు పడింది. ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగే మార్గం సుగమమైందని స్థానిక ప్రజానీకం హర్షం వ్యక్తపరిచారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని ప్రియదర్శిని పార్క్ వద్ద నిర్మించనున్న ప్రధాన లింక్ బ్రిడ్జి పనులకు మంగళవారం రాష్ట్ర ఐటీ మంత్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, పట్నం మహేందర్ రెడ్డి, మధు యాష్కీ గౌడ్, మిద్దెల జితేందర్, రాంమోహన్ గౌడ్, తదితర కాంగ్రెస్ నాయకుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఈ బ్రిడ్జిని ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కీలక ప్రాజెక్ట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మధు యాష్కీ గౌడ్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి చొరవతో నేడు కార్యరూపం దాల్చిందని మంత్రి తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సరూర్‌నగర్, ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గి, ప్రజలకు సులభమైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్, మహేందర్ యాదవ్, శంకర్ యాదవ్, శరత్ గుప్తా, ప్రవీణ్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇంటర్నెట్ సేఫ్టీ డే అవగాహన కార్యక్రమం

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 10(భారత శక్తి): నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ , జిల్లా సమాచార అధికారి శ్రీ ఎం. రవి శంకర్ గారి ఆధ్వర్యంలో ఇంటర్నెట్ సేఫ్టీ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పురుషుల కళాశాల, ప్రభుత్వ మహిళల కళాశాల విద్యార్థులు మరియు ఐసీడీఎస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశం వైఎస్సార్ కడప జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐఐటీ, ఇడుపులపాయకు చెందిన డీన్ డాక్టర్ రత్న కుమారి గారు హాజరై, సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై విలువైన సూచనలు అందించారు.




ఈ సందర్భంగా ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఉపయోగించు కోవడం, సైబర్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలి, సోషల్ మీడియా వినియోగం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు సిబ్బందిలో డిజిటల్ భద్రతపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు 1000 మందితో భారీ బందోబస్తు

- **మూడు మున్సిపాలిటీ పరిధిలో 80 వార్డులకు,244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు**
- **48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు,37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్ల పై ప్రత్యేక దృష్టి**
- **శాంతియుత ఎన్నికలే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం**
- **ఎన్నికల విధుల గురించి పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (భారతశక్తి) : నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సుమారు 1000 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భైంసా, నిర్మల్ పట్టణంలో పోలీసు ఎన్నికల విధుల్లో పాల్గొనే




పోలీస్ అధికారులు, సిబ్బందికి మార్గదర్శకం చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 80 వార్డులకు 244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఈ ఎన్నికల సందర్భంగా 48 సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లు, 37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు. పోలింగ్ రోజు అక్రమ మద్యం, డబ్బు పంపిణీ, ప్రలోభాలు, బెదిరింపులు వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్లు, ప్రధాన రహదారులు మరియు సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా వచ్చే ఫుటేజ్‌ను కంట్రోల్ రూమ్ నుంచి 24×7 పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావన పెంచుతున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. "ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.